ANN తెలుగు

Follow: @ANNTELUGU

11-07-2026

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 168 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM









## ఓటును తొలగించడం అంత ఆషామాషీ కాదు

- సీఈవో సుదర్శన్ రెడ్డి
- ఓటరు జాబితా ప్రక్షాళనలో భాగంగా ఎస్ఐఆర్

02

టాప్ న్యూస్

సోషల్ వార్

## దుర్వినియోగంపై ఉక్కుపాదం



- రాష్ట్ర స్థాయిలో 'సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్' ఏర్పాటు
- చంద్రబాబు కేబినెట్ కీలక నిర్ణయాలు

03

## అన్న రాజ్యం' కాదు..' అక్క రాజ్యం' ఎలా ఉంటుందో చూపిస్తా



- కల్వకుంట్ల కవిత

02

## అరెస్టు చేసినా, చంపేసినా సిద్ధమే ..బంగ్లాదేశ్‌కు వెళ్లి తీరుతా



- బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా

02



# రాసిపెట్టుకో.. కేసీఆర్

వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు మావే

మళ్లీ అధికారంలోకి వస్తాం

భద్రాద్రి రాముడిపై ఆన

- 2029 జూన్ లోనే అసెంబ్లీ ఎన్నికలు
- తెలంగాణలో 26 లోక్ సభ.. 182 అసెంబ్లీ సీట్లు
- ఖమ్మం సభలో సీఎం రేవంత్‌రెడ్డి సంచలనం
- కల్వకుంట్ల కుటుంబాన్ని పాతాళానికి తొక్కేవరకు విశ్రమించం
- హరీష్ రావు బీజేపీలోకి టచ్ లో ఉన్నడు..
- మీమామ మీద రాముడిమీద ఒట్టేయ్

**మధిర, మహా:** రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవని, అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 182కి.. లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కి పెరుగుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. 2029 మేజూన్‌లో శాసనసభ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. 182 స్థానాల్లో 117 సీట్లకు పైగా గెలుస్తాం.. ఇది భద్రాచలం రాముడిపై ఆన .. ఇది కాంగ్రెస్ కార్యకర్తల ప్రతిన. కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళానికి తొక్కుతాం. పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌లో బంధించాం. ఆ పాపాల భైరవుడికి ఇకపై విముక్తి లేదు. ఆనాడు వరి వేస్తే.. ఉరి వేసినట్లే అని కేసీఆర్ అన్నారు. కానీ మేం వ్యవసాయం దండగ కాదు.. పండుగ అన్నాం. పేదలకు సన్నబియ్యం,

మిగతా 3వ పేజీలో

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లో.. కన్నమాల ఇవాన్ రాయెల్

02

# మార్క్స్ హాస్పిటాలిటీ మాయాజాలం!

## భ్రష్టు పట్టిన మున్సిపల్ శాఖ !

### తాండవిస్తున్న అవినీతి అక్రమాలు!



- సర్వే నంబరు 60లో అనుమతులు... ప్రభుత్వ సర్వే నంబరు 59లో వెలుగు చూసిన అక్రమం !
- కొండాపూర్‌లో 669 గజాల భూమి స్వాహా
- నకిలీ పత్రాలతో జీహెచ్ఎంసీ అనుమతులు పొందిన బిల్డర్లు
- అధికారుల అందదండలతో బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు
- హెచ్చరిక బోర్డు తొలగింపు... క్రిమినల్ కేసులు ఎక్కడ?
- అనుమతుల రద్దుపై అధికారుల మీనమేషాలు 'స్టేటస్ కో' వెనుక అసలు కథ ఏమిటి?
- కొరడా ఝులిపించాల్సిన 'హైడ్రా' ఎక్కడ?

కొండాపూర్ సర్వే నెంబర్ 59 లో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం మీన మేషలు లెక్కిస్తుంది . బహిరంగ మార్కెట్లో సుమారు రూ. 10 కోట్లకు పైగా ధర పలికే ఈ విలువైన ప్రభుత్వ భూమిని తహసీల్దార్ స్వయంగా పరిశీలించి, ఇది ప్రభుత్వ స్థలమేనని నిర్ధారించడంతో పాటు ఇక్కడ ప్రభుత్వ హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటు చేశారు. అయితే, అక్రమార్కుల బరితెగింపు ఏ స్థాయికి చేరిందంటే... అధికారులు ఏర్పాటు చేసిన ఆ బోర్డును రాత్రికి రాత్రే అక్రమార్కులు తొలగించి, ప్రభుత్వ యంత్రాంగానికే బహిరంగ సవాల్ విసిరారు. చట్టం అన్నా, అధికార యంత్రాంగం అన్నా నయాపైసా భయం లేకుండా బోర్డును పీకేసి, మళ్లీ యథావిధిగా నిర్మాణ పనులు కొనసాగిస్తుండడం స్థానికులను తీవ్ర కలవరపాటుకు గురి చేస్తోంది.

02

## ఆ రోజు పోలీసులే నన్ను తప్పుదోవ పట్టించారు

- ఘటనకు డీఎంకే, పోలీసులే కారణం
- కరూర్ ఘటనపై సీఎం విజయ్

02





## ఒట్టేసి ఒక మాట, ఒట్టేయకుండా మరో మాట చెప్పను

- సీఎం వ్యాఖ్యలపై హరీశ్ రావు

02

## పాలిటిక్స్ లోకి అల్లుఅర్జున్ ?

పీకేతో చర్చలు

గత రెండేళ్ళుగా అల్లు అర్జున్ ఫోకస్



03

- అభిమానసంఘాల పటిష్ఠం.. పుష్ప-2రిలీజ్ కు ముందునుండే చర్చలు
- విజయ్ సీఎం కాకముందే ప్లాన్ చేసుకున్న అల్లు అర్జున్
- తండ్రి అల్లు అరవింద్ కు, మామ చంద్రశేఖర్ రెడ్డికి పాలిటిక్స్ లో అనుభవం
- రెండు రాష్ట్రాల్లో స్పేస్ ఉందని భావిస్తున్న అల్లు టీమ్
- అల్లు పొలిటికల్ ఎంట్రీపై గత ఏడాది మహాపత్రికలో ప్రత్యేక కథనాలు

## అయ్యప్పస్వామికి పబ్లిసిటీ అవసరం లేదు

- దేవస్వం బోర్డు
- శబరిమల యాత్రలో భారీ సంస్కరణలు

02







# మార్క్స్ హాస్పిటాలిటీ మాయాజాలం!

**స్పెషల్ టాస్క్ ఫోర్స్:**

**రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, కొండాపూర్ :** రాష్ట్ర మున్సిపల్ శాఖ క్షేత్రస్థాయిలో ఏ రకంగా భ్రష్టు పట్టిందో చెప్పడానికి కొండాపూర్ భూ దందాయే సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. ఒకవైపు స్వయంగా ముఖ్యమంత్రి పరిధిలో శాఖ నడుస్తున్నా, క్షేత్రస్థాయిలో అవినీతి అక్రమాలు యథేచ్ఛగా తాండవిస్తున్నాయి. తాజాగా కొండాపూర్ పరిధిలో వెలుగుచూసిన ఈ మెగా స్కామ్ వెనుక 'మార్క్స్ హాస్పిటాలిటీ' మాయాజాలం ఉన్నట్లు పక్కా ఆధారాలతో నిరూపితమైంది. నకిలీ పత్రాలు సృష్టించి, అధికారుల అండదండలతో ఏకంగా 669 గజాల విలువైన ప్రభుత్వ భూమిని స్వాహా చేసేందుకు సాగించిన స్కెచ్ చూసి సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి .



ప్రభుత్వ భూమని తహసీల్దార్ జారీ చేసిన పత్రం

**మార్క్స్ హాస్పిటాలిటీ లీలలు.. సర్వే నంబర్ 60లో పర్మిషన్.. 59లో నిర్మాణం!**

ఈ దందా వెనుక ఉన్న మార్క్స్ హాస్పిటాలిటీ బిల్డర్లు ఎంతటి బరితెగింపునకు ఒడిగట్టారంటే.. జీహెచ్ఎంసీ అధికారుల కళ్ళు గప్పి సర్వే నంబర్ 60 పేరుతో భవన నిర్మాణ అనుమతులు పొందారు. తీరా చూస్తే, ఆ అనుమతులను పక్కనబెట్టి, పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి అయిన సర్వే నంబరు 59లో 669 గజాల స్థలాన్ని ఆక్రమించి, అందులో రెండు వేర్వేరుగా ఒక నిర్మాణం 223.1 స్క్వేర్ మీటర్లు , మరొక నిర్మాణం 337.18 స్క్వేర్ మీటర్లతో "జీ+3 అంతస్తులు" జీహెచ్ఎంసీ నుండి నిర్మాణ అనుమతులు పొంది ఏడు అంతస్తుల అక్రమ నిర్మాణాన్ని సాగించారు. కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి కళ్లముందే కబ్జా అవుతున్నా టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు ముట్టాయానే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి."జీ+3 అంతస్తుల "నిర్మాణ అనుమతులు కూడా ఇల్లీగల్ అవుతాయి.


సాధారణంగా వందలాది రోగుల ప్రాణాలు కాపాడే ఆసుపత్రి నిర్మించాలంటే పక్కాగా అన్ని రకాల అనుమతులు ఉండాలి. జీహెచ్ఎంసీ క్లియరెన్స్, హెల్త్ డిపార్ట్‌మెంట్ లైసెన్స్, కాలుష్య నియంత్రణ మండలి అనుమతితో పాటు అత్యంత ముఖ్యమైన ఫైర్ సేఫ్టీ ఎన్ఓసీ, పార్కింగ్ వసతులు చట్టప్రకారం ఉండాలి. రేపు పొద్దున ఏదైనా ప్రమాదం జరిగితే వందలాది మంది రోగుల ప్రాణాలు గాల్లో కలవాల్సిందేనా? హాస్పిటల్ బోర్డు తిప్పాలని చూస్తున్న 'మార్క్స హాస్పిటాలిటీ' సంస్థకు కనీస చట్టాల పట్ల గౌరవం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అసలు పునాదే ప్రభుత్వ భూమిలో అక్రమంగా వేసి, రేపు హాస్పిటల్‌కు పర్మిషన్లు ఎలా తెచ్చుకుంటారని ప్రజలు నిలదీస్తున్నారు

**కొరడా ఝులిపించాల్సిన 'హైడ్రా' ఎక్కడ?**

రాష్ట్రంలో ఎక్కడ అక్రమ కట్టడాలు కనిపించినా, ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనా జేసీబీలతో విరుచుకుపడే 'హైడ్రా' కొండాపూర్ సర్వే నెంబర్ 59 వైపు ఎందుకు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నకిలీ పత్రాలతో అనుమతి పొందిన దందా గుట్టు రట్టయినా, తహసీల్దార్ స్వయంగా నివేదిక ఇచ్చినా హైడ్రా యాక్షన్ లోకి దిగకపోవడం వెనుక మతలబు ఏంటి? సామాన్యుడి ఇల్లు కూల్చడానికి ఉరుకులు పరుగులు పెట్టే యంత్రాంగం, మార్క్స్ హాస్పిటాలిటీ లాంటి పెద్ద బిల్డర్ల అక్రమాలను చూసి ఎందుకు వెనకడుగు వేస్తోంది? ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, కోర్టుకు వాస్తవాలు వివరించి 'స్టే'ను వెకేట్ చేయించడంతో పాటు, ప్రభుత్వ భూమిని కాపాడి అక్రమార్కులను జైలుకు పంపాలని ప్రజా సంఘాలు, స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

**ప్రభుత్వ బోర్డు తొలగింపు.. క్రిమినల్ కేసులు ఎక్కడ?**

'మహా పత్రిక ' వరుస కథనాలతో శేరిలింగంపల్లి తహసీల్దార్ స్వయంగా రంగంలోకి దిగి, అది ప్రభుత్వ భూమేనని నిర్ధారించి హెచ్చరిక బోర్డు నాటిన సంగతి తెలిసిందే. అయితే, ఈ మార్క్స్ హాస్పిటాలిటీ అక్రమార్కులు ఆ బోర్డును రాత్రికి రాత్రే పీకేసి ప్రభుత్వానికే సవాల్ విసిరారు. ఇంత జరిగినా, ప్రభుత్వ బోర్డును ధ్వంసం చేసిన సదరు వ్యక్తులపై ఇప్పటివరకు పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు కాకపోవడం వెనుక ఏ శక్తులు ఒత్తిడి తెస్తున్నాయో అర్థం కావడం లేదు.


OFFICE OF THE GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
BUILDING PERMIT ORDER AND WORK COMMENCEMENT LETTER

Ref: 1. Your Building Application File No : 001348/GHMC/01088/IABP/C21/2025 dated: 09/05/2025.
2. Post verification dt 26/05/2025

With reference to subject cited, it is to inform that You have obtained provisional building permission for construction of Individual Residential Building consisting of Stilt For Parking + 3 Upper Floor, to an extent of 223.01 Sq mt, situated at Plot No: PLOT NO. 12-C , KONDAPUR Locality, Survey No: 60 , Village Kondapur, Serilingampally Mandal, Rangareddy District, Instant Approval based on the self certification submitted by you and the authority has conducted the Post verification as per GHMC TG-bPASS Act. It is observed that the provisional building permission obtained by you is found correct and you can proceed with the construction subject to the following conditions:

1. If the abutting road width is less than 30 feet (9.00 Mts.), 15 feet (4.5 Mts.) from the center of the existing road has to be left for road widening in addition to front setback as per rule 4 (a) of G.O. Ms. No. 168 MA dt:07-04-2012 or required area affected under Master Plan road.
2. The built up area shall be limited to the remaining plot area after leaving the road affected area and all sides setbacks.

DETAILS OF PERMISSION SANCTIONED

రెండు వేరు, వేరుగా తీసుకున్న పర్మిషన్ లు

**అనుమతుల రద్దుపై మీనమేషాలు.. 'స్టేటస్ కో' వెనుక అసలు కథ ఏమిటి?**

కబ్జాదారుల మోసాన్ని గుర్తిస్తూ సదరు నకిలీ అనుమతులను రద్దు చేయాలని తహసీల్దార్ మాదాపూర్ డీసీకి అధికారికంగా లేఖ రాసినా, జీహెచ్ఎంసీ అధికారులు మాత్రం నెలల తరబడి అనుమతుల రద్దుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ కాలయాపనను ఆసరాగా చేసుకున్న కబ్జాదారులు.. లోపాయికారీగా అధికారుల సహకారంతో కోర్టు మెట్లు ఎక్కి 'స్టేటస్ కో' (యథాతథ స్థితి) ఉత్తర్వులు తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. అధికారులు కావాలనే పర్మిషన్ రద్దు చేయకుండా లేట్ చేసి, కబ్జాదారులు కోర్టు నుండి స్టే తెచ్చుకునేలా దారి చూపించారనే బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ 'స్టేటస్ కో' నాటకం వెనుక నడిచిన



అసలు కథ, చేతులు మారిన కోట్ల రూపాయల ముడుపుల వ్యవహారం ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది.

## అరెస్టు చేసినా, చంపేసినా సిద్ధమే .. బంగ్లాదేశ్‌కు వెళ్లి తీరుతా

**- బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా**

**ఢిల్లీ, మహా :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనా కీలక ప్రకటన చేశారు. స్వదేశంలో మరణశిక్షను ఎదుర్కొంటున్నప్పటికీ, ఈ ఏడాది డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లి న్యాయస్థానం ముందు లొంగిపోవాలని నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న 78 ఏళ్ల హసీనా, ఒక మీడియా సంస్థకు టెలిఫోన్ ద్వారా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ విషయాలను స్పష్టం చేశారు. తనతో పాటు పార్టీకి చెందిన ఇతర సీనియర్ నాయకులు కూడా స్వదేశానికి తిరిగి వస్తారని ఆమె పేర్కొన్నారు. "వారు నన్ను అరెస్టు చేయవచ్చు లేదా హతమార్చవచ్చు. ఏదేమైనా నేను వెళ్లాల్సిందే. ఒకవేళ మరణం సంభవిస్తే, అది నా తల్లిదండ్రులు విశ్రమిస్తున్న నా మాతృభూమిపైనే జరగాలి" అని హసీనా భావోద్వేగానికి లోనయ్యారు. మరణశిక్షను ఎదుర్కొంటున్న మరో సీనియర్ నాయకుడు, మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్ కూడా ఆమెతో పాటు బంగ్లాదేశ్‌కు వెళ్లే వారిలో ఉన్నారు

## సోషల్ వార్

**దుర్వినియోగంపై ఉక్కుపాదం ... చంద్రబాబు కేబినెట్ కీలక నిర్ణయాలు**

**అమరావతి, మహా :** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. సమాజానికి సోషల్ మీడియా దుర్వినియోగం ఒక రోగంలా పరిణమించిందని, దాని వల్ల మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతోందని కేబినెట్ అభిప్రాయపడింది. వ్యక్తిత్వ హననం, ప్రభుత్వాలపై అబద్ధపు ప్రచారం, మహిళలను కించపరచడం వంటివి శ్రుతిమించుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో అనైతిక కార్యకలాపాలను ఏమాత్రం ఉపేక్షించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి పార్థసారథి తెలిపారు. దీని కోసం కొన్ని కీలక చర్యలను కేబినెట్ ఆమోదించిందని వివరించారు. రాష్ట్ర స్థాయిలో ఒక 'సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్' ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దుర్వినియోగం, విద్వేష ప్రచారాలను అరికట్టేందుకు 'రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్' ఏర్పాటుతో పాటు విద్వేషాలు వ్యాప్తి చేసే హ్యాండిల్స్‌ను గుర్తించడానికి ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ కొనుగోలుకు నిధులు కేటాయించాలని నిర్ణయించారు.

## ఆ రోజు పోలీసులే నన్ను తప్పుదోవ పట్టించారు




**చెన్నై, మహా :** గతేడాది సెప్టెంబర్‌లో 41 మంది మృతికి కారణమైన కరూర్ తొక్కిసలాట ఘటన తర్వాత తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ శుక్రవారం తొలిసారిగా ఆ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గత డీఎంకే ప్రభుత్వం, పోలీసులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల ప్రచార సభకు ముందు జరిగిన ఆ విషాదం వెనుక కుట్ర ఉందని, పోలీసులు తనను తప్పుదోవ పట్టించారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ పర్యటనలో ఏర్పాటు చేసిన సభలో విజయ్ మాట్లాడుతూ.. "ఆ విషాదం నా జీవితంలో అత్యంత బాధాకరమైన క్షణం. అది నన్ను ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది. ఎంత విజయం సాధించినా జీవితంలో ఇలాంటి ఘటనలు జరుగుతాయి. నేను కరూర్‌లోకి ప్రవేశిస్తున్నప్పుడు పోలీసులు నన్ను ఆపి ఉండొచ్చు కదా? ఆ సమావేశాన్ని రద్దు చేసే హక్కు వారికి ఉంది. కానీ, వారు అలా చేయలేదు, పైగా నన్ను లోపలికి నడిపించారు" అని పోలీసుల తీరును తప్పుపట్టారు. "ఈ ఘటనకు అసలు బాధ్యులు ఎవరు? దీని వెనుక ఎవరున్నారు?" అని ప్రశ్నిస్తూ, అప్పటి అధికార పార్టీ అయిన డీఎంకేపై విమర్శలు ఎక్కుపెట్టారు. తొక్కిసలాట తర్వాత తాను మౌనంగా ఉండటంపై వచ్చిన విమర్శలను కూడా ఆయన తిప్పికొట్టారు. "అమాయకమైన పసిపిల్లలు చనిపోయారు. నేను తీవ్ర వేదనతో ఇంట్లో కుమిలిపోతుంటే, దాక్కున్నానంటూ మీరు నన్ను ఎగతాళి చేశారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజకీయ ప్రత్యర్థులు, పోలీసులు కలిసి ఈ తొక్కిసలాటను సృష్టించారని ఆరోపించారు. "పోలీసులు తగినంత సిబ్బందిని మోహరించారా? సిగ్గులేకుండా నాపై నిందలు వేశారు. అసెంబ్లీలో ఎంకే స్టాలిన్ ఈ అంశంపై రాజకీయం చేశారు" అని మండిపడ్డారు. తన పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఎన్నికల ప్రచారాన్ని దెబ్బతీయడానికే ఈ కుట్ర పన్నారని విజయ్ ఆరోపించారు.

## ఒట్టేసి ఒక మాట, ఒట్టేయకుండా మరో మాట చెప్పను



**హైదరాబాద్, మహా :** హరీశ్ రావు బీజేపీ నేతలతో టచ్‌లో ఉన్నారని ఈ విషయం నిజమో కాదో రాముడిపై ఒట్టేసి చెప్పాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. 'రేవంత్ రెడ్డి... మాట తప్పడం, పార్టీలు మారడం నీ రాజకీయ సంస్కృతి కావొచ్చు. కానీ నాది కాదు. 20 ఏళ్ల నీ రాజకీయ చరిత్ర, 25 ఏళ్ల నా రాజకీయ చరిత్ర నే దానికి నిదర్శనం. నీలాగా ఒట్టు వేసి ఒక మాట, ఒట్టు వేయకుండా మరో మాట చెప్పే అలవాటు నాకు లేదు' అన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రెస్ నోట్ రిలీజ్ చేసిన ఆయన సీఎంపై విమర్శలు గుప్పించారు. భద్రాద్రి శ్రీరాముడి సాక్షిగా సంపూర్ణ రుణమాఫీ చేస్తానని చేసిన నీ ప్రమాణం ఏమైంది? అని రేవంత్ రెడ్డిని హరీశ్ రావు ప్రశ్నించారు. రాష్ట్రం సంగతి పక్కన పెడదాం... కనీసం నువ్వు సభ పెట్టిన ఖమ్మం జిల్లాలో అయినా రైతులందరికీ పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగిందా? సమాధానం చెప్పగలవా? అని నిలదీశారు. ఒకవైపు "చివరి ఏడాదిలో రాజకీయాలు చేద్దాం" అంటూ.. మరోవైపు ప్రతి బహిరంగ సభలో ఎందుకంత ఆవేశంతో, అసహనంతో రగిలిపోతున్నావు? అని మండిపడ్డారు. కన్నెపల్లి నుండి నీళ్ళు లిఫ్ట్ చేయని నీ చేతగాని తనాన్ని అబద్ధాలతో కవర్ చేసుకోవాలని చూడటం హీనమైన చర్య అని 28 లక్షల వరద వచ్చినప్పుడే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు చెక్కు చెదరలేదు. లక్ష క్యూసెక్కుల వరద వస్తున్న ప్రస్తుత సమయంలో ఏదో జరుగుతుందని ఎందుకు భ్రమలు కల్పిస్తున్నావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కన్నెపల్లి పంపు హౌస్ నుంచి నీళ్లను లిఫ్ట్ చేసి అన్నారం, సుందిళ్ల ద్వారా ఎల్లంపల్లికి తరలించాలని చెబుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదు? రిటైర్డ్ ఇంజనీర్ల సుదీర్ఘ అనుభవం అంటే మీకు లెక్కే లేదా? అన్నారు. తెలంగాణ రైతులకు ఉపయోగపడాల్సిన నీళ్లు ఏపీకి తరలిపోతుంటే సీఎం, నీళ్ల మంత్రి ఎందుకు చేష్టలుడిగి చూస్తున్నట్లు? గురుదక్షిణ చెల్లింపులో భాగంగానే కన్నెపల్లి పంపులను ఆన్ చేయకుండా తెలంగాణ జలాలను ఏపీకి వదులుతున్నారా? దీనిపై ముఖ్యమంత్రి ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.



## అయ్యప్పస్వామికి పబ్లిసిటీ అవసరం లేదు

**: దేవస్వం బోర్డు**

శబరిమల యాత్రలో భారీ సంస్కరణలు

మహా : శబరిమల వార్షిక యాత్రను పురస్కరించుకుని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) కీలక సంస్కరణలను ప్రకటించింది. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, యాత్రా నిర్వహణను ఆధునీకీకరించడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపట్టినట్లు వెల్లడించింది. ఇందులో భాగంగా గతంలో వివాదాస్పదంగా మారిన 'అయ్యప్ప సంగమం' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. 'అయ్యప్ప స్వామికి ఎలాంటి ప్రచారం అవసరం లేదు' అని బోర్డు అధ్యక్షుడు కె. జయకుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. నవంబర్ మధ్యలో ప్రారంభమయ్యే రెండు నెలల యాత్ర సీజన్‌కు ముందే ఈ నిర్ణయాలు వెలువడ్డాయి. నూతన సంస్కరణల ప్రకారం భక్తులకు అందించే సేవలను పూర్తిగా డిజిటలైజ్ చేయనున్నారు. రద్దీని పర్యవేక్షించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు.

వసతి గదుల ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయాన్ని బోర్డు భారీగా విస్తరించింది. సన్నిధానంలోని మొత్తం 690 గదుల్లో ఇకపై 550 గదులను భక్తులు ఆన్ లైన్ ద్వారా ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు. గతంలో ఈ సంఖ్య కేవలం 190గా మాత్రమే ఉండేది. గదుల బుకింగ్‌కు సెక్యూరిటీ డిపాజిట్ విధానాన్ని రద్దు చేసి, కేవలం అద్దెతో పాటు నామమాత్రంగా రూ.50 సర్వీస్ ఛార్జిని మాత్రమే వసూలు చేయనున్నారు.భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించేందుకు సన్నిధానంతో పాటు బోర్డు ప్రధాన కార్యాలయంలో ఏఐ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. పడిపూజ బుకింగ్‌లు 2048వ సంవత్సరం వరకు నిండిపోవడంతో, తంత్రి అనుమతితో రోజుకు ఒకటిగా ఉన్న పూజల సంఖ్యను ఐదుకు పెంచాలని బోర్డు యోచిస్తోంది. గత సీజన్‌లో మరణించిన 54 మంది భక్తుల కుటుంబాలకు రూ. 1 లక్ష చొప్పున బీమా సాయం అందజేయనున్నారు. వర్చువల్ క్యూ టిక్కెట్లపై వసూలు చేసే రూ. 5 సుంకం ద్వారా ఈ నిధులను సమకూరుస్తారు. వర్షాకాలం అనంతరం క్లీన్ కేరళ కంపెనీ ఆధ్వర్యంలో సన్నిధానం పరిసరాలను శుభ్రం చేయనున్నారు. అన్నదానం పథకాన్ని ప్రామాణీకరించి, ఎటువంటి వివక్షకు ప్రమేయం లేకుండా భక్తులందరికీ ఒకే తరహా కేరళ భోజనం అందించాలని నిర్ణయించారు.



## సమస్యలపై ఎంజీఆర్ సమరం

ఖైరతాబాద్, మహా : ఖైరతాబాద్ నియోజకవర్గం ఫిలింనగర్ డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్, బాలిరెడ్డి నగర్ ప్రాంతాల్లో 'సమస్యలపై సమరం' పేరుతో చేపట్టిన పాదయాత్ర శుక్రవారం ఉత్సాహంగా సాగింది. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకీ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాదయాత్రలో భాగంగా స్థానిక బస్తీల్లో పర్యటించిన మన్నె గోవర్ధన్ రెడ్డికి ప్రజలు తమ కష్టాలను వివరించారు. ముఖ్యంగా వీధి దీపాలు వెలగకపోవడం, రహదారుల దుస్థితిపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. స్పందించిన గోవర్ధన్ రెడ్డి, తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

**ఓటరు నమోదుపై అవగాహన**

అభివృద్ధి పనుల పరిశీలనతో పాటు, ఓటరు నమోదు ప్రక్రియపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. వినాయక్ నగర్ బీఎల్ఓ సైదులు, బాలిరెడ్డి నగర్ బీఎల్ఓ యాదయ్యలతో కలిసి ఇంటింటికీ వెళ్ళిన నాయకులు, ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. 'నా ఓటు - నా బాధ్యత' అనే నినాదంతో ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. అర్హులైన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నరసింహ, సుజాత, భాగ్యమ్మ, శ్రీనివాస్ రెడ్డి, రాజు, గురిగాడు, ప్రభాకర్, శేఖర్, సంతోష్, సుదీర్, శ్రీకాంత్, కార్తీక్, రమేష్, సునీల్, చింటూ, మోహన్, ఆకాష్, సురేష్‌తో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఓటును తొలగించడం అంత ఆషామాషీ కాదు

**హైదరాబాద్, మహా** ఓటరు జాబితా ప్రక్షాళనలో భాగంగా ఎస్ఐఆర్ చేపడుతున్నామని సీఈవో సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. జూన్ 25 నుంచి జులై 24 వరకు ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలు అందిస్తున్నామని వెల్లడించారు. ప్రతి వ్యక్తికి రెండు ఎన్యూమరేషన్ పత్రాలు ఇస్తామని సీఈవో సుదర్శన్‌రెడ్డి తెలిపారు. రెండు ఎన్యూమరేషన్ పత్రాలు నింపి, ఒకటి బీఎల్‌వోకు ఇవ్వాలన్నారు. రెండో ఎన్యూమరేషన్ పత్రాన్ని ప్రజల దగ్గరే ఉంచుకోవాలని చెప్పారు. ఎన్యూమరేషన్ పత్రాన్ని నింపి ఇస్తేనే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఉంటుందని వెల్లడించారు. ఒకవేళ ఎన్యూమరేషన్ పత్రం ఇవ్వలేకపోతే ఫామ్ 6 ఇవ్వాలని సూచించారు. డ్రాఫ్ట్ జాబితాలో పేరు లేకపోతే ఫామ్6 ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈసీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లోనూ ఎన్యూమరేషన్ పత్రాలు నింపవచ్చని చెప్పుకొచ్చారు. ఓటును కావాలనే తొలగించరని, అలా తొలగించాలంటే ఆషామాషీ విషయం కాదని సీఈవో వెల్లడించారు. ఓటు తొలగించే ముందు సంబంధిత ఓటరుకు సమాచారం ఇచ్చే తీసెయ్యాలని స్పష్టం చేశారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

**--జిల్లా అదనపు కలెక్టర (రెవెన్యూ) వి రాములు**

మంచిర్యాల, మహా : మంచిర్యాల జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు అన్నారు. శుక్రవారం నస్పూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సి.ఐ.ఆర్.) ప్రక్రియ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత జి.పి.ఓ.లు, బి.ఎల్.ఓ.లు, బి.ఎల్.ఓ. సూపర్‌వైజర్లు, అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేయడంతో పాటు, సమాచార నమోదు, సేకరణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత ఖచ్చితత్వంతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతి దశలో నాణ్యతను పాటిస్తూ నిర్ణీత కాలపరిమితిలో పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.





## అన్న రాజ్యం' కాదు..' అక్క రాజ్యం' ఎలా ఉంటుందో చూపిస్తా

**కల్వకుంట్ల కవిత**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రక్షణ సేన ఎన్నికల్లో విజయం సాధిస్తే 'అన్న రాజ్యం' కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో రుచి చూపిస్తానని ఆ పార్టీ అధ్యక్షురాలు కవిత అన్నారు. రైతును నిజమైన రాజును చేస్తానని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడగానే ప్రతి ప్రభుత్వ ఆఫీసులో రైతులకు ప్రత్యేక గౌరవ కుర్చీలు ఏర్పాటు చేస్తామన్నారు. మహిళల కోసం ఒక వినూత్న ఆలోచన చేశామని... త్వరలోనే దాని వివరాలు ప్రకటిస్తానని చెప్పారు. 'పాంచజన్యం' అనే నినాదంతో మార్పు కోసం ముందుకు సాగుతామని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని కొత్త గంగారం తదితర ఆదివాసి గ్రామాల్లో పర్యటించిన కవిత, స్థానికుల జీవన విధానాన్ని, సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వెనకబడిన గిరిజనుల హక్కుల సాధన కోసమే తాను తెలంగాణ రక్షణ సేనను స్థాపించానని, ఇక్కడికి వచ్చింది రాజకీయాల కోసం కాదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసమేనని స్పష్టం చేశారు. 1950 రికార్డుల్లో నాయకపోడు తెగ పేరు లేకపోవడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల హక్కుల సాధనకై అవసరమైతే ఢిల్లీ వేదికగా పోరాడతామన్నారు. కార్పొరేట్ శక్తుల వేల కోట్ల అప్పులు మాఫీ చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం... ఆదివాసి బిడ్డలు బైక్ కొందామన్నా బ్యాంక్ లోన్లు ఎందుకు ఇవ్వడం లేదని కవిత నిలదీశారు. విదేశాల తరహాలోనే ఇక్కడి గిరిజనులకు కూడా రూ.2 లక్షల నుండి రూ.2 కోట్ల వరకు సులభంగా లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## సింగరేణిలోని ఐదు గనులకు

# 5-స్టార్ రేటింగ్

- అత్యుత్తమ గనులుగా ఆర్.కె న్యూటెక్, ఆర్.కె-6, జె.వి.ఆర్ ఓసి-2, ఖైరిగూడ, ఆర్.జి ఓసీ-1
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందనలు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కేంద్ర బొగ్గు శాఖ ప్రతీ ఏటా నిర్వహించే అత్యుత్తమ గనుల ఎంపికలో ఈ సారి సింగరేణి సంస్థ నుండి 5 గనులు 5స్టార్ రేటింగ్ సాధించి జాతీయ స్థాయి ఉత్తమ అవార్డులకు ఎంపిక య్యాయి. కేంద్ర బొగ్గు శాఖ విడుదల చేసిన జాబితాలో శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన
ఆర్.కె న్యూటెక్, ఆర్.కె6, సత్తుపల్లి ఏరియా నుండి జె.వి.ఆర్ ఓసి2, బెల్లంపల్లి ఏరియా నుండి ఖైరిగూడ ఓపెన్ కాస్టు గని, రామగుండం3 ఏరియా నుండి ఆర్.జి ఓసి1 గనులు అత్యుత్తమ 5స్టార్ రేటింగ్ గనులుగా ఎంపికైనట్లుగా ప్రటించారు. దేశవ్యాప్తం గా 382 గనులు ఈ 5 స్టార్ రేటింగ్ కోసం దరఖాస్తు చేసుకోగా అందులో 50 గనులు 5 స్టార్ రేటింగ్‌కు ఎంపిక కాగా, ఇందులో 5 గనులు సింగరేణి నుంచి ఉండటం విశేషం.గత ఏడాది 4 గనులకు ఈ 5స్టార్ రేటింగ్ రాగా ఈ సారి 20242025 సంవత్సరానికి గాను సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా 5 గనులకు 5స్టార్ రేటింగ్ లభించడం జరిగింది. దీనిపై రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఉత్తమ గనుల అధికారులకు కార్మికులకు సిబ్బందికి తన అభినందనలు తెలిపారు. ఇతర గనులకు కూడా ఈ గనులను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. బొగ్గు గనుల్లో ఉత్తమ పని విధానం కార్మిక సంక్షేమం పర్యావరణహిత చర్యలు సమీప గ్రామాల అభివృద్ధి వంటి 7 ప్రధాన విభాగాల్లో మొత్తం 50 అంశాలలో అత్యుత్తమంగా ఉంటున్న గనులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వారు తన అనుబంధ సంస్థ అయిన కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ ద్వారా ప్రతీ ఏడాది ఈ పోటీని నిర్వహిస్తున్నారు. కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ వారు ప్రతీ ఏటా దేశ వ్యాప్తంగా ఉన్న బొగ్గు గనుల నుండి 5స్టార్ రేటింగ్ లో పాల్గొనవల్సిందిగా ఆహ్వానం పలుకుతుంటారు. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ బొగ్గు మైనింగ్ కంపెనీలు ఈ 5స్టార్ రేటింగ్ కోసం స్వీయ మూల్యాంకనం నిర్వహించుకుని దరఖాస్తు చేస్తుంటాయి. ఇందులో ప్రధానంగా 7 విభాగాల్లో గనుల ప్రతిభ పని పరిస్థితులు పరిగణనలోకి తీసుకుంటారు. ఆ గనుల్లో మైనింగ్ ఎలా నిర్వహిస్తారు..? బొగ్గు తవ్వకం టెక్నాలజీని సమర్ధవంతంగా వాడుతున్నారా..? గని ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నాయి..? గని ప్రభావిత ప్రాంతాలలో గ్రామాలలో సంక్షేమ చర్యలు కార్మిక సంక్షేమ చర్యలు ఏ స్థాయిలో అమలవుతున్నాయి..?రక్షణ కార్మికుల భద్రతకు తీసుకొంటున్న చర్యలు పర్యావరణహిత చర్యలు వంటివి పరిశీలనకు తీసుకొంటారు. ఈ 7 ప్రధాన విభాగాల్లో మొత్తం 50 అంశాలలో ఏ గనులు అయితే నూటికి 90 శాతం మార్కులు పై బడి సాధిస్తాయో వాటిని 5స్టార్ (అత్యుత్తమ) గనులుగా గుర్తిస్తారు. 5స్టార్ రేటింగ్ ఇచ్చేముందు కోల్ కంట్రోలర్ విభాగానికి చెందిన నిపుణుల బృందం ఆ గనులను సందర్శించి ఆ గనులు ఇచ్చిన సమాచారం సరైనదేనా..? కాదా..? అని తనిఖీ చేస్తారు. ప్రత్యక్ష పరిశీలనలో సంతృప్తి చెందిన తర్వాతనే అత్యుత్తమ గనులను 5స్టార్ రేటింగ్ గనులుగా ఎంపిక చేసి ప్రకటిస్తారు. సింగరేణి సంస్థలో కూడా కోల్ కంట్రోలర్ విభాగం నిపుణుల బృందం ఇటీవల ప్రత్యక్ష పరిశీలన జరిపింది. అనంతరం 5 గనులను 5 స్టార్ రేటింగుకు ఎంపిక చేసింది. సింగరేణి సంస్థ పనితీరుకు రక్షణ భద్రత పర్యావరణహిత చర్యల అమలుకు గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయని ఉత్తమ గనుల అధికారులు పేర్కొంటున్నారు. 4 స్టార్ రేటింగ్ లో మరో 17 గనులు ఇదిలా ఉంటే 5స్టార్ కన్నా కొంచెం తక్కువ మార్కులు (8090 శాతం) సాధించిన గనులను 4 స్టార్ రేటింగ్ గనులు అంటారు. ఈ గనులకు ఎటువంటి అవార్డులు ఇవ్వరు కానీ దాదాపు ఉత్తమ శ్రేణి వరకు వచ్చిన గనులుగా గుర్తింపు వస్తుంది. సింగరేణిలో ఈ సారి 4స్టార్ రేటింగ్ ను 17 గనులు సాధించడం విశేషం. కొద్ది మార్కుల తేడాతో ఈ గనులు 5స్టార్ రేటింగ్ ను కోల్పోయాయి.
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందనలు..
సింగరేణిలో 5 గనులు తమ అత్యుత్తమ పనితీరుతో జాతీయ స్థాయిలో 5స్టార్ రేటింగ్ గనులుగా గుర్తింపు పొందినందుకు రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. క్రమ శిక్షణ రక్షణ సంక్షేమ కార్యక్రమాలు పర్యావరణహిత చర్యలను సమర్ధంగా అమలు జరుపుతూ రాష్ట్ర అవసరాలకు తగిన బొగ్గును ప్రమాద రహితంగా అందిస్తున్నందుకు ఆయన సంస్థ యాజమాన్యానికి గనుల అధికారులకు కార్మికులకు తన అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని గనులు అత్యుత్తమ పనితీరుతో 5స్టార్ రేటింగ్ సాధించాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లో..
# కన్నమాల ఇవాన్ రాయెల్

### 8 ఏళ్ళ వయసులోనే అదరగొట్టిన చిచ్చరపిడుగు




**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ కు చెందిన ఎనిమిదేళ్ల బాలుడు కన్నమాల ఇవాన్ రాయెల్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపును అధికారికంగా అందుకుని తెలుగు ప్రజలందరికీ గర్వకారణంగా నిలిచాడు. కరాటేలో అద్వితీయ ప్రతిభ కనబరిచి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ నుంచి అధికారిక గోల్డ్ మెడల్ మరియు సర్టిఫికెట్ అందుకోవడంతో ఆయన పేరు ప్రపంచ రికార్డుల చరిత్రలో నమోదైంది. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ, క్రమశిక్షణ, పట్టుదలతో ఈ విజయాన్ని సాధించిన ఇవాన్ రాయెల్ ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ప్రపంచ స్థాయి గుర్తింపు రావడం వెనుక కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, నిరంతర సాధన, అంకితభావం కీలక పాత్ర పోషించాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, బంధుమిత్రులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు చిన్నారిని అభినందిస్తూ ఆయన భవిష్యత్తులో మరెన్నో అంతర్జాతీయ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. తెలుగు బాలుడు ప్రపంచ వేదికపై తన ముద్ర వేయడం ప్రతి తెలుగు కుటుంబానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు. బాలుడి తండ్రి రాకేష్ కన్నమాల ఇటీవల ఎఎన్ఎన్ మహా అవార్డ్స్ లో బెస్ట్ డిజిటల్ స్ట్రాటజిస్ట్ అవార్డ్ ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. అంకితభావం, క్రమశిక్షణ, సామర్థ్యం, నిరంతర శ్రమ వీరి విజయానికి కేరాఫ్ గా నిలుస్తున్నాయి.

# రాసిపెట్టుకో.. కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)
వడ్లకు బోనస్ అందిస్తున్నాం. అని రేవంత్ వ్యాఖ్యానించారు. రైతుభరోసా తుది విడత సాయం పంపిణీ సందర్భంగా ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం జగన్నాథపురంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్, బీజేపీపై విమర్శలు చేశారు. ''ఇక్కడి ప్రజలను చూస్తే నా గుండె పులకిస్తోంది. రాజకీయంగా నాకు పాలమూరు ప్రాణం. నా రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం గుండెకాయగా పనిచేసింది. నేడు వరి కొనుగోలు చేసి బోనస్ ఇస్తున్నాం. రైతును రాజు చేయాలని మంత్రి తుమ్మల ప్రయత్నిస్తున్నారు. నాడు వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని అసత్యాలు చెప్పారు. ఉచిత కరెంట్.. కాంగ్రెస్ పేటెంట్ రైట్. మా ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్లలో రైతులకు రూ.1.70లక్షల కోట్లు ఖర్చు చేశాం'' అని రేవంత్ అన్నారు.

**కల్వకుంట్ల కుటుంబాన్ని పాతాళానికి తొక్కేవరకు విశ్రమించం**

కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ రాజకీయ ముఖచిత్రం నుంచి పాతాళానికి తొక్కే వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు విశ్రమించరని రేవంత్‌రెడ్డి అన్నారు. ''గత ఎన్నికల సమయంలో కేసీఆర్ మాయమాటలు, మూటలతో వస్తున్నారని కొందరు చెప్పారు. వాళ్లని ఎలా ఎదుర్కోగలరని ప్రశ్నించారు. వాళ్లు ఎలా వచ్చినా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తోందని ఆనాడే చెప్పా. ఎన్నికల్లో మాకు 64 సీట్లు వచ్చాయి. ఉప ఎన్నికల్లో మరో 2 గెలిచాం. బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లోనూ గుండు సున్నా తప్పదని చేవెళ్ల సభలో చెప్పా. అన్ని ఎన్నికల్లోనూ నేను చెప్పినట్లుగానే ప్రజలు



తీర్పు ఇచ్చారు. ఎన్నికల్లో ఓడించి పాపాల భైరవుడిని ఫాంహౌస్‌కి పరిమితం చేశాం. కౌరవ వంశాన్ని తెలంగాణ గడ్డ నుంచి తొలగిస్తాం. కాసుకో కేసీఆర్.. నిన్ను, నీ బంధువులను, సర్వేలను ఓడిస్తాం. మిమ్మల్ని ఓడించేందుకు రోజూ 18 గంటలు పనిచేస్తాం. మోదీ, అమిత్‌షా ఇతర పార్టీలను లొంగదీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్, ఆప్‌లను చీల్చారు. ఇతర పార్టీలను కూడా లొంగదీసుకుని లోక్‌సభ సీట్ల పెంపు బిల్లును ఎలా అయినా ఆమోదింపజేసుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ విషయంలో వారు విజయం సాధించడానికి అవకాశం ఉంది'' అని రేవంత్ అన్నారు.

**హరీష్ రావు బీజేపీలోకి వెళ్ళనని రాముడిమీద ఒట్టెయ్**

హరీశ్ రావుపై రేవంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావు.. బీజేపీ నేతలతో రాత్రిపూట హరీశ్ రావు మంతనాలు జరుపుతున్నారని ఆరోపించారు. నిజంగా బీజేపీలోకి వెళ్లనని ఆ భద్రాచలం రాముడిపై, మీ మామ కేసీఆర్ మీద ఒట్టేసి చెప్పగలవా?' అని హరీశ్ కు సవాల్ విసిరారు . హరీశ్ రావు తాటి చెట్టంత పెరిగాడు కానీ, చింతకాయంత మెదడు కూడా లేదు అంటూ ఘాటుగా విమర్శించారు. సోంబేరి గాడు కేటీఆర్.. పగలు గబ్బు మాటలు, సాయంత్రం పబ్బులకే పరిమితం అని రేవంత్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ చేయిస్తున్న సర్వేలపైనా ఆయన సెటైర్లు వేశారు. పెళ్లికి బ్యాండ్ మేళం పిలుచుకుని, మనకు నచ్చింది వాయించమని చెప్పినట్లుగా ఉంది బీఆర్ఎస్ సర్వేలు అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సొంత సర్వేలో బీఆర్ఎస్ గెలవబోతోందని ఫలితం వచ్చిందని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం ఫైర్ అయ్యారు. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో ఇలాగే సర్వేల పేరుతో డబ్బా కొట్టుకున్నారు. కానీ ప్రజల తీర్పు మాకు అనుకూలంగా ఇచ్చారని, ఇప్పుడు మేము జరిపించిన సర్వేలో మాకు వ్యతిరేకంగా ఫలితాలు వచ్చాయని ప్రచారం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎన్ని సీట్లు ఉంటాయో? ఏ రిజర్వేషన్లు ఉంటాయో తెలియకుండానే ఎవరైనా సర్వేలు చేయిస్తారా అని ప్రశ్నించారు.

**మీ రాజకీయాల కోసం గ్రామాలు మునగాలా?:**

కన్నెపల్లి పంప్ హౌస్‌లు ఓపెన్ చేయాలని బీఆర్ఎస్ నేతల మాటలపై సీఎం ఘాటుగా రియాక్ట్ అయ్యారు. కన్నెపల్లి పంప్‌లు ఆన్ చేస్తే భద్రాచలం రాముడి గుడి సహా 44 గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని మీ లుచ్చా రాజకీయాల కోసం భద్రాచలం రాముడు, గ్రామాలు మునగాలా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఇంట్లో ఒకరంటే మరొకరికి పడదని ధ్వజమెత్తారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని దుర్మార్గులు విష ప్రచారం చేశారు. ఇవాళ నేను కల్వకుంట్లోళ్లను అడుగుతున్న ఉదయం, మధ్యాహ్నం, రాత్రి పూట ఎప్పుడైనా కరెంట్ వైర్‌ను పట్టుకో కాకిలా మాడి మసి అయిపోతారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్ రైట్ అన్నారు. సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు పాయ వెంకటేశ్వర్లు, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రంప్‌ను చంపేందుకు
# ఇరాన్ మాస్టర్ ప్లాన్

**ఇజ్రాయెల్ నిఘా వర్గాల హెచ్చరిక**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను హతమార్చేందుకు ఇరాన్ పన్నిన తాజా కుట్రలను ఇజ్రాయెల్ నిఘా వర్గాలు పసిగట్టాయి. ఈ ఇంటెలిజెన్స్ సమాచారాన్ని ఇజ్రాయెల్ వాషింగ్టన్‌తో పంచుకున్నట్లు కథనాలు పేర్కొన్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య మళ్లీ ఘర్షణలు మొదలైన వేళ ఇజ్రాయెల్ నివేదిక సంచలనం రేపుతోంది. ఇది పశ్చిమాసియాలో యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేస్తుందేమోనన్న ఆందోళనలను పెంచుతోంది. అటు తాజా ఘర్షణలను ట్రంప్ నెతన్యాహుకు వివరించినట్లు ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం తెలిపింది. ఇరువురి మధ్య కొనసాగుతున్న నిరంతర చర్చల్లో భాగంగా గల్ఫ్‌లో అమెరికా కదలికలపై నెతన్యాహుకు ట్రంప్ సమాచారం అందించినట్లు పేర్కొంది. ఇదే సమయంలో తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్, ఆయన అనుచరుల తీరుపై నెతన్యాహు ఆందోళన వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ ఉనికికి వ్యతిరేకంగా వారు ప్రకటనలు చేస్తున్నారని ట్రంప్‌నకు చెప్పారు. ఇజ్రాయెల్ సరిహద్దుల వెంబడి భద్రతా మండలాల ఆవశ్యకతను ప్రస్తావించారు. ఇరాన్‌పై సైనిక చర్యను తీవ్రతరం చేయాలా వద్దా అనే విషయంలో ట్రంప్ నిర్ణయాన్ని ప్రభావితం చేయడానికి ఇజ్రాయెల్ చేస్తున్న ప్రయత్నంలో ఇది ఒక భాగమై ఉండవచ్చునని అమెరికా అధికారులు భావిస్తున్నారు. అలాగే, ఇరాన్‌తో సంఘర్షణ ఏ దిశగా సాగాలనే విషయంలో ట్రంప్, ఇజ్రాయెల్ మధ్య విభేదాలు పెరుగుతున్న నేపథ్యంలో కూడా ఈ నివేదికలు రావడం గమనార్హం.

## కారేపల్లిలో విద్యాసంస్థల
# బంద్ విజయవంతం

**కారేపల్లి, మహా :** విద్యారంగ సమస్యలపై విద్యార్థి సంఘాలు ఇచ్చిన రాష్ట్ర విద్యా సంస్థల పిలుపు మేరకు శుక్రవారం సింగరేణి మండలంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యసంస్థలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా కారేపల్లి హైస్కూల్లో ఎస్ఎఫ్ఐ నాయకులు చిలుముల భరత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలలో మౌలిక వసతులు కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరుతో రూ.వేల కోట్లు ఖర్చు చేస్తూ ప్రస్తుతం ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్, ప్రభుత్వ కళాశాలలు స్కూలు లను నిర్వీర్యం చేయటానికి ప్రయత్నిస్తుందన్నారు. కారేపల్లిలో బీసీ హాస్టల్ కి సొంత భవనం నిర్మించాలని, ఎస్సీ ఎస్టీ హాస్టల్స్ ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు స్కూలుసు కాలేజీల్లో అధిక ఫీజులను అరికట్టాలని విద్యా కార్పో రేటికర్ణను ఆపాలని వినయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దిలీప్, శరత్, విష్ణు,సాయిరాం, అనిల్, ఏఐఎస్ఎఫ్ నాయకులు చెన్నంశెట్టి ఆకాష్ సాయి, , పిడిఎస్ యు నాయకులు పాల్గొన్నారు.

# రూ.124 కోట్లతో ధర్మారెడ్డి కాలువ అభివృద్ధి


**పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ రెడ్డి**



**యాదాద్రి భువనగిరి, జూలై 10 (మహా):** వలిగొండ మండలం సంగెం-ధర్మారెడ్డిపల్లి-గోకారం గ్రామాల పరిధిలో రూ.124 కోట్ల వ్యయంతో చేపట్టిన ధర్మారెడ్డి కాలువ అభివృద్ధి పనులను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. పనుల నాణ్యత, కాలువ వెడల్పు, లోతు, నీటి ప్రవాహానికి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరిన ధర్మారెడ్డి కాలువను కాంగ్రెస్ ప్రభుత్వం రూ.124 కోట్లతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తోందన్నారు. కాలువలోని అడ్డంకులు తొలగించి చివరి ఆయకట్టు వరకు సాగునీరు చేరేలా పనులు చేపట్టామని తెలిపారు. కాలువ పక్కనే రహదారిని కూడా అభివృద్ధి చేయడంతో రైతులు, ప్రజలకు రాకపోకలు సులభమయ్యాయని చెప్పారు.
ఈ నెల 17న ధర్మారెడ్డి కాలువలో నీటిని విడుదల చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. దీంతో సంగెం, ధర్మారెడ్డిపల్లి, గోకారం, వర్కట్‌పల్లి గ్రామాల వేల ఎకరాలకు సాగునీరు అందడంతో రైతులకు శాశ్వత ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. మిగిలిన పనులను నాణ్యతతో గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## పాలకుర్తి నూతన ఎంపీడీవోకు పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికిన సర్పంచ్ .

**పాలకుర్తి, జూలై 10 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం
పాలకుర్తి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రమేష్ నీ శుక్రవారం పాలకుర్తి గ్రామ సర్పంచ్ పెద్దపల్లి తిరుమల ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.
అనంతరం సర్పంచ్ పెద్దపల్లి తిరుమల మాట్లాడుతూ. నూతన ఎంపీడీవో రమేష్ నాయకత్వంలో మండలంతో పాటు పాలకుర్తి గ్రామం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అధికారుల, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా అందుతాయనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. గ్రామీణ సమస్యల పరిష్కారానికి, సంక్షేమ పథకాల అమలుకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటలైజ్ ప్రక్రియ
# వేగవంతం చేయాలి

**డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ**

**యాదాద్రి భువనగిరి, జూలై 10 (మహా):** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెల 24 నాటికి పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ ఆదేశించారు. శుక్రవారం న్యూ ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పాల్గొన్నారు. ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్యానికి కీలకమని పేర్కొన్న ఆయన, అర్హులైన ప్రతి పౌరుడి పేరు జాబితాలో ఉండేలా, అనర్హులు చేరకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటింటి సర్వేలు, బూత్ స్థాయి అధికారుల పనితీరు, పేర్ల నమోదు, తొలగింపు, సవరణ ప్రక్రియలను ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. విచారణ లేకుండా



ఏ ఓటరు పేరును తొలగించరాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 99.6 శాతం, డిజిటలైజేషన్ 21.94 శాతం పూర్తయిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి వెల్లడించారు.

# రూ.2.75 కోట్లతో మార్కెట్ గోదాం

**శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ రెడ్డి**

యాదాద్రి భువనగిరి, జూలై 10 (మహా): బీబీనగర్ మండలం గూడూరు గ్రామంలో భువనగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ ఆధ్వర్యంలో రూ.2.75 కోట్ల వ్యయంతో 2,500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల నూతన మార్కెట్ గోదాం నిర్మాణ పనులకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు ఈ గోదాం ఉపయోగపడుతుందని తెలిపారు. గోదాం నిర్మాణం పూర్తయితే 2,500 మెట్రిక్ టన్నుల వరకు పంటలను శాస్త్రీయంగా నిల్వ ఉంచి, అనుకూల ధర వచ్చే వరకు భద్రపరచుకునే అవకాశం రైతులకు కలుగుతుందని చెప్పారు.వ్యవసాయ రంగ బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు, గోదాములు, మార్కెట్ యార్డులు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ గోదాం గూడూరుతో పాటు పరిసర గ్రామాల రైతులకు ప్రయోజనం చేకూర్చనుందని తెలిపారు.



## ఎస్ ఐఆర్ పేరుతో ఏఒక్క నిజమైన ఓటును కూడా తొలగించొద్దు

**సిపిఎం డిమాండ్**

వలిగొండ జులై 10 మహా న్యూస్ భారత ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది అత్యంత కీలకమైనదని SIR పేరుతో ఏఒక్క నిజమైన ఓటును తొలగించొద్దని ప్రజల ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూర శ్రీనివాస్ లు అన్నారు శుక్రవారం SIR ఫామ్స్ ను నింపే విషయంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా చూసేందుకు వలిగొండ పట్టణంలో 2వ వార్డు లో సర్వే నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి పౌరునికి ఓటు హక్కును భారత రాజ్యాంగం కల్పించిందని నేడు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన SIR పేరుతో ఓటర్ల జాబితా నుండి ఏ ఒక్క ఓటును కూడా తొలగించకుండా ఎన్నికల అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు పట్టణంలో 8పోలింగ్ బూత్ లలో అనేక కుటుంబాలకు చెందిన వారి ఓట్లు గల్లంతు అయ్యాయని దీనితో కొందరికి ప్రభుత్వం ఇస్తున్న SIR ఫారాలు అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఎవ్వరికి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఉండ్రాటి పాపయ్య,కాలనీ ప్రజలు బొల్లు రమేష్, పలుసం భాస్కర్,అంజమ్మ,పద్మ,తదితరులు పాల్గొన్నారు.



# గెలుపు లక్ష్యం



గెలవాలి. గెలిచి తీరాలి. గెలుపే లక్ష్యంగా చేసుకోవాలి. తెలంగాణ రాష్ట్రం బీజేపీ సర్కార్ ఏర్పాటు కావాలి. ఇదే మన టార్గెట్. ఇందులో ఎంతమాత్రం వెనక్కితగ్గొద్దు. పోరాడండి. ప్రజలకు చేరువకండీ. ప్రజా సమస్యల పరిష్కారం పైన దృష్టి పెట్టటండి. అంతర్గత ఆధిపత్య పోరు అసలు వద్దు. మనందరికి ప్రధాని మోడీ మార్గదర్శకం. ఆయన నాయకత్వంలో కలిసి కట్టుగా నడుద్దాం. ఇది బీజేపీ అగ్రనాయకులు తెలంగాణ కమలనాధులకు ఇస్తున్న సూచనలు. ఢిల్లీ నుంచి ఏ బీజేపీ నేత తెలంగాణకు వచ్చినా వచ్చే అసెంబ్లీ ఎన్నికల గురించి మాత్రమే మాట్లాడుతున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా మొదలుకుని బీజేపీ అగ్రనేతల హితవు ఒక్కటే.

అదే తెలంగాణలో బీజేపీ జెండా ఎగురాలి. ఈ దిశగానే వారు తెలంగాణలో పర్యటనలు సాగిస్తున్నారు. పార్టీ పరిస్థితి పైన సమీక్షా సమావేశాలు నిర్వహించి, తెలంగాణలో అధికారంలోకి వచ్చే ప్రణాళికలు వివరిస్తున్నారు. గత రెండు, మూడు నెలలు నుంచి ఢిల్లీ నుంచి ప్రతీ వారం రోజులకు ఓ బీజేపీ అగ్రనేత, కేంద్ర మంత్రి తెలంగాణకు వస్తూనే వున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ గెలిచి తీరాలి అన్న మాటలే వారి పర్యటన సారాంశం అవుతున్నాయి. దింతో తెలంగాణ బీజేపీ నేతలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. తెలంగాణలో అసలు బీజేపీ బలం ఏమిటీ? రాష్ట్రం బలంగా వున్న కాంగ్రెస్, బీ ఆర్ ఎస్ లను వెనక్కి నెట్టి నెగ్గుకు రావటం ఎలా? ఏం చేస్తే తెలంగాణలో బీజేపీ విజయం సాధ్యమవుతుంది? ఇవే ప్రశ్నలు ఇప్పుడు తెలంగాణ బీజేపీ నేతలను వెంటాడుతున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం వున్న రాజకీయ పరిస్థితి నేపథ్యంలో బీజేపీ అధికారంలోకి రావాలి అంటే ఏదో ఓ అద్భుతం జరగాలి. రాజకీయ పెనుమార్పులు రావాలి. అలాంటి పరిస్థితి ఏది ఇప్పుడు తెలంగాణలో కనిపించడం లేదు. మరి బీజేపీ ఎలా అధికారం వైపు అడుగులు వేస్తుంది? ఎలాంటి వ్యూహం ఇప్పుడు ఢిల్లీ నుంచి తెలంగాణ బీజేపీ నేతలకు అందబోతోందన్నది ఆసక్తికరంగా మారింది.

తెలంగాణలో బీజేపీకి జనాకర్షణ కలిగిన మాస్ లీడర్లు లేకపోవటం పెద్ద లోటుగా మారింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఢిల్లీలో ఓ కాలు, తెలంగాణలో ఓ కాలు పెట్టి రెండు పడవల ప్రయాణం చేస్తున్నారు. సీనియర్ బీజేపీ నేత డాక్టర్ లక్ష్మణ్ చాలా మేరకు కేంద్ర పనుల్లో బిజీగా వుంటున్నారు. అయినా ఆయన మాస్ లీడర్ కాదు. సాఫ్ట్ పాలిటిక్స్ కు మాత్రమే ఆయన పరిమితం. ఇక మిగిలింది బండి సంజయ్. తెలంగాణ జనాల్లో బండి సంజయ్ కు కొంత గుర్తింపు వుంది. గతంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షులుగా ఆయన ప్రదర్శించిన దూకుడు ప్రజలను ఆకట్టుకుంది. తెలంగాణలో బండి సంజయ్ వైపు ప్రజలు దృష్టి పెడుతున్న సమయంలోనే ఆయన అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవల్సి వచ్చింది. ఇప్పుడు కేంద్ర మంత్రి పదవిలో ఆయన వున్నారు. ఇటీవల ఆయన కుటుంబ సభ్యులు వివాదంలో చిక్కుకోవటంతో బండి సంజయ్ కొంత ఇరకాటంలో పడ్డారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షులుగా వున్న రాంచందర్ రావు మంచి మేధావి అయినా తెలంగాణలో ఆయన ప్రాబల్యం చెప్పుకోదగిన స్థాయిలో లేదు. ఇలాంటి ఇబ్బందుల మధ్య తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకొని వచ్చే కమల సారధి ఎవ్వరు? ఇదే తెలంగాణ బీజేపీ శ్రేణులు కూడా తమకు తాము వేసుకుంటున్న ప్రశ్న. తెలంగాణలో రాజకీయ పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ఇక్కడ దూకుడు రాజకీయాలకే ప్రజలు ప్రభావితం అవుతారు. ఉద్యమ స్ఫూర్తి, పోరాట పటిమ, దూసుకుపోయే స్వభావం, సంచలనాలు సృష్టించే నైజం వున్న మాస్ లీడర్లు మాత్రమే తెలంగాణ రాజకీయాల్లో గుర్తింపు పొందిన చరిత్ర వుంది. మరి బీజేపీలో ఈ లక్షణాలు వున్న లీడర్ ఎవ్వరు? తెలంగాణలో బీజేపీని విజయం వైపు పరుగులు పెట్టించే నైపుణ్యం ఎవ్వరికి వుంది? రాష్ట్రం క్షేత్ర స్థాయిలో పేరు, పలుకుబడి, గుర్తింపు వున్న బీజేపీ సీనియర్ నేతలు బండారు దత్తాత్రేయ, ఇంద్రసేనారెడ్డి, సీ. హెచ్. విద్యాసాగర్ రావులాంటి వారు ఇప్పుడు పర్యటనలు చేసే పరిస్థితిలో లేరు. వయోభారంతో పాటు తెలంగాణ రాజకీయాలకు వారు చాలా కాలంగా దూరం ఉంటున్నారు. ఇప్పుడు వాళ్ళు ప్రజల్లోకి వచ్చినా బీజేపీకి పెద్దగా కలిసి వచ్చేది ఏమి లేదు. ఇలాంటి పరిస్థితిలో బీజేపీని తెలంగాణలో పరుగులు పెట్టించే బాధ్యత ఎవరు తీసుకుంటారు. ఇదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలి అన్నది ఢిల్లీ బీజేపీ పెద్దల ఆర్డర్. అందుకు అనుగుణంగా నిర్ణయాలు కూడా ఉండాలి. మాస్ కు మాస్, క్లాస్ కు క్లాస్ లాంటి లీడర్లను బీజేపీ గుర్తించాలి. తెలంగాణలో ఎనిమిది మంది బీజేపీ ఎమ్మెల్యేలు, ఎం, పీ లు వున్నారు. వారిలో ఎంత మంది ప్రజాదరణ పొందుతున్నారు అనేది అధిష్టానం గుర్తించాలి. కిషన్ రెడ్డి, బండి సంజయ్, ధర్మపురి అరవింద్, ఈటెల రాజేందర్, రఘు నందన్, డి. కే.అరుణ వంటి కొందరు మాత్రమే రాష్ట్ర ప్రజలకు సుపరిచితులు. మిగిలిన వారి పరిస్థితి ఏమిటి? అంటే దానికి సమాధానం చెప్పటం కష్టమే. ఎక్కువగా మీడియాలో వుండే నేతలు కూడా వీరే. మిగితా బీజేపీ ప్రజా ప్రతినిధులను రాష్ట్ర ప్రజలు పెద్దగా గుర్తించే పరిస్థితి లేదు. ఇది బీజేపీకి ఓ ఇబ్బందికరమైన అంశం. బీజేపీలో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత వుంది. ఎవ్వరు పడితే వాళ్ళు ఇష్టానుసారంగా వ్యవహరించటం పార్టీలో సాధ్యం కాదు. అధిష్టానం ఆదేశాలు శిరసా వహించి, పార్టీ సిద్దాంతాలు పాటించటం బీజేపీలో తప్పనిసరి. వివాదాలకు కూడా బీజేపీలో స్థానం ఉండదు. క్రమశిక్షణ విషయంలో బీజేపీ నిక్కచ్చిగా ఉంటుంది. ఇది పార్టీలో కీలకం. ఇంత వరకు బాగానే వుంది. ఇదే లక్ష్మణరేకపైన బీజేపీలో ప్రతీ ఒక్కరు కట్టుబడి వుంటారు. కానీ ఈ లక్ష్మణరేకను కూడా ఇప్పుడు కొందరు బీజేపీ నేతలు దాటుతున్నారు. తెలంగాణ బీజేపీలో అంతర్గత ఆధిపత్య పోరు అప్పుడప్పుడు బయట పడుతూనే వుంది. నేతలు తమ ఉనికి చాటుకునే ప్రయత్నంలో చేస్తున్న వ్యాఖ్యలు వివాదంగా మారుతున్నాయి.

అధికారమే అంతిమ లక్ష్యంగా తెలంగాణలో పావులు కదిపేందుకు బీజేపీ అగ్రనేతలు వ్యూహ రచన చేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా పార్టీని క్షేత్ర స్థాయి వరకు పటిష్టం చేసే ఆలోచనలో వున్నారు. బూత్, మండలం, వార్డ్, జిల్లా స్థాయి కమిటీలు పటిష్టంగా ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. ప్రజా సమస్య పైన ఎప్పటికి అప్పుడు స్పందించి పోరాటం చేసే ఆలోచనలు మొదలు పెట్టారు. నిజానికి ఒకప్పుడు ప్రజా సమస్యల పరిష్కర పోరాటాల్లో వామ పక్ష పార్టీల తరువాత బీజేపీ వుంటూ వచ్చేది. ఇప్పుడు ఆ పోరాట పటిమ లేకుండా పోయింది. మీడియా ప్రకటనలకే చాలా మంది కమల నాధులు పరిమితం అయ్యారు. ఇదే బీజేపీ నేతలు,ప్రజలకు మధ్య దూరం పెంచుతోంది అనటంలో సందేహం లేదు. పార్టీ కార్యాలయంలో నిత్యం కనిపించే కొందరు బీజేపీ నేతలు క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదురుకొంటున్న సమస్యలను మాత్రం పట్టించుకోవటం లేదనే టాక్ వుంది. ఇది నూటికి నూరు పాళ్ల నిజం. అగ్ర నేతల దృష్టిలో పడి ఏదో ఓ పదవి సంపాదించుకోవాలి అనే వారే బీజేపీలో ఇప్పుడు కనిపిస్తున్నారని ఆ పార్టీ కార్యకర్తలే అంటున్నారు. ప్రజలకు చేరువ కావాలి అంటే పార్టీ నేతలు క్షేత్ర స్థాయిలో కనిపించాలన్నదే క్యాడర్ మాట. ఈ దిశగా రాష్ట్ర బీజేపీ నాయకత్వం కూడా గట్టి ఆదేశాలు ఇవ్వాలి అంటూ వారు సూచిస్తున్నారు. ఢిల్లీ బీజేపీ అగ్ర నేతలు కూడా ఇదే చెప్తున్నారు. ప్రజల్లో ఉంటేనే పార్టీ బలమైన స్థాయికి చేరుకుంటుంది అన్న విషయం అగ్ర నేతలు పదే పదే గుర్తు చేస్తున్నారు.

తెలంగాణ కమలనాధులు రాష్ట్ర అవసరాలు, అభివృద్ధి, సమస్యల పరిష్కారం పైన కన్నేశారు. అగ్ర నేతలు చెప్పినట్లుగా ప్లాన్ అమలు చేస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ మేరకు బాధ్యతలు చెప్పట్టినట్టు అర్థమవుతోంది. ఇందులో భాగంగా సింగరేణిపైన ఆయన దృష్టి పెట్టారు. తాడిచర్ల బొగ్గు గనులు సింగరేణికి కేటాయించిన కిషన్ రెడ్డి తెలంగాణ అభివృద్ధిలో తన చిత్తశుద్ధి చాటుకున్నారు. అభివృద్ధి అంశాల్లో రాజకీయం చేయమని చెప్పేశారు. తెలంగాణ సాధనలో బీజేపీ నేతల పాత్రను కూడా గుర్తు చేశారు. అక్కడితో ఆగిపోలేదు. తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కు కూడా ప్రజల హితం కోసం పని చేయాలన్నారు. అంటే కిషన్ రెడ్డి తెలంగాణలో బీజేపీ బరువు, బాధ్యతలు భుజం మీద వేసుకొని పార్టీని ముందుకు నడిపించటం పైన శ్రద్ధ పెట్టారని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు క్లాస్ గా రాజకీయాలు చేస్తూ సాగిపోయేలా, కిషన్ రెడ్డి మాస్ లో దూసుకుపోయేలా ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది. వీరికి బండి సంజయ్, ఈటెల రాజేందర్, రఘునందన్ తో పాటు ఇతర నేతలు అండగా నిలుస్తే తెలంగాణలో బీజేపీని పరుగులు పెట్టించవచ్చని ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. బీ ఆర్ ఎస్ ను, కాంగ్రెస్ ను దీటుగా ఎదుర్కొనేలా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేసే ఆలోచన కూడా కమలనాధులు వున్నారు. కేంద్రం నుంచి తెలంగాణకు లభించిన సహాయం, సహకారం వివరిస్తూనే రేవంత్ సర్కార్ తప్పిదాలు ప్రజలకు అర్థం అయ్యేలా చేసే మరో ప్రణాళిక కూడా బీజేపీ సిద్ధం చేస్తోందట. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్ గా ఇప్పుడు కమలం శ్రేణులు బరిలోకి దిగుతున్నాయని ఆ పార్టీ నేతలు అంటున్నారు. ఇప్పటిదాకా తెలంగాణ బీజేపీ ఓ ఎత్తు ముమ్మందు మరో ఎత్తు అంటూ ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీ ఆర్ ఎస్ ల ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ పార్టీని విజయం వైపు పరుగులు పెట్టించటమే తమ ధ్యేయం అంటున్న బీజేపీ నేతలు ఇప్పుడు కదనోత్సాహం వున్నారు. మోదీ, అమిత్ షా ఆదేశాలు వారికి కర్తవ్య బోధన అయ్యాయి. తెలంగాణలో అధికారం రావాలి. డబుల్ ఇంజిన్ సర్కార్ తో ప్రగతి ఉరకలు వేయాలి. ఇదే వారి విధానం.. నినాదం...



**జీ. వెంకటరమణ.**
**సీనియర్ జర్నలిస్ట్.**

# పాలిటిక్స్‌లోకి అల్లుఅర్జున్ ?






(హైదరాబాద్ మహా)
ఐకాన్ స్టార్, జాతీయ ఉత్తమనటుడిగా నిలిచిన అల్లు అర్జున్ తన కుటుంబంలో ఎవరికీ సాధ్యం కాని పీఠంపై కన్నేశారు. అసాధ్యాలు సుసాధ్యం చేయడం ముందునుండీ తన కఠోరదీక్షతో అలవాటు చేసుకున్న అల్లు అర్జున్ పాలిటిక్స్ పై గత రెండేళ్ళుగా కన్నేశారు. అల్లు అర్జున్ పొలిటికల్ ఎంట్రీ ఇచ్చేందుకు ఇప్పటినుంచే గ్రౌండ్ వర్క్ ప్రిపేర్ చేసుకుంటున్నారనే చర్చలు టాలీవుడ్ వర్గాల్లో చాలా కాలంగా ఉన్నాయి. ప్రస్తుతం రాకా, లోకేశ్ కనగరాజ్ సినిమాలతో బిజీగా ఉన్న బన్నీ.. మరో ఎనిమిదేళ్ల తర్వాత అంటే 2034 ఎన్నికలపై దృష్టి పెట్టాలని, అందుకు తగ్గట్లే ప్లాన్స్ సిద్ధం చేసుకుంటున్నారని టాక్. ఇందులో భాగంగా రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తోనూ సంప్రదింపులు జరుపుతున్నారని రూమర్స్ వినిపిస్తున్నాయి. ఈ మధ్య కాలంలో చూసుకుంటే ప్రశాంత్ కిశోర్.. తమిళ స్టార్ హీరో తళపతి విజయ్ వెనకుండి నడిపించారు. ఈయన తమిళనాడు ముఖ్యమంత్రి కావడంలో భాగమయ్యారు. ఇప్పుడు అల్లు అర్జున్ కూడా విజయ్‌లా తన అభిమాన సంఘాలతో ప్రజలకు చేరువై, ఆ తర్వాత పొలిటికల్ ఎంట్రీ ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్ రాజకీయ రంగప్రవేశం గురించిన రూమర్స్ ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ అయిపోయాయి.

**పొలిటికల్ ఫ్యామిలీనే**

అల్లు అర్జున్ తెలుగులో ఎవరికీ సాధ్యంకాని జాతీయ ఉత్తమనటుడి అవార్డు సొంతం చేసుకున్నారు. పుష్పతో దేశవ్యాప్తంగా మాస్ ఇమేజ్ సొంతం చేసుకున్నారు. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ అల్లు అర్జున్ కు స్పెషల్ ఫ్యాన్ బేస్ ఉంది. అటు మేనమామలు చిరంజీవి, పవన్ కల్యాణ్, నాగబాబు ఇప్పటికే పాలిటిక్స్ లో ఉండగా, అల్లు అరవింద్ కూడా ప్రజారాజ్యంపార్టీలో చిరంజీవికి వెన్నంటి నిలిచారు. మామ చంద్రశేఖర్ రెడ్డి పాలిటిక్స్ లో ఉన్నా ఎమ్మెల్యే కావాలన్న కోరిక తీరలేదు. సౌత్ ఇండియాలో రాజకీయాలకు సినిమాలకు మధ్య ఒకదానికొకటి విడదీయరాని సంబంధం ఉంది. ఎంజీఆర్, ఎన్టీఆర్ తర్వాత ఇటీవలే తమిళనాడులో తలపతి విజయ్ పార్టీని పెట్టి ఏకంగా ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోవడం సంచలనంగా మారింది. సినిమా కెరీర్‌ను వదిలేసి పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన విజయ్ అతి తక్కువ సమయంలోనే బంపర్ విక్టరీ సాధించడంతో మరికొంత మంది నటులు అదే బాటలో రాజకీయ రంగంలోకి వచ్చేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. ఈ క్రమంలో వెండితెరపై తనదైన నటన, డాన్సులతో కోట్లాది మంది ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న అల్లు అర్జున్ ఇప్పుడు ప్రజా సేవ వైపు అడుగులు వేసేందుకు బలమైన పునాది వేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే అందరిలా కాకుండా ఇప్పటి వరకు సినిమా టు పొలిటికల్ ట్రాక్ లోకి వచ్చిన వారి విజయాలు, వైఫల్యాలను అంచనా వేసుకుంటూ అత్యంత వ్యూహాత్మకంగా ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది.

## స్ట్రాటజిస్ట్ తో అడుగులు

ఇందులో భాగంగా ప్రముఖ పొలిటికల్ స్ట్రాటజిస్ట్ ప్రశాంత్ కిశోర్‌తో అల్లు అర్జున్ అంతర్గత సంప్రదింపులు జరిపారనే వార్తలు ఇప్పుడు సినీ, రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. టీవీకే చీఫ్ విజయ్ గెలుపులో ప్రశాంత్ కిశోర్ టీమ్ కీలక భూమిక పోషించిన సంగతి తెలిసిందే. తమిళనాడులో విజయ్ పార్టీని అధికారంలోకి తీసుకురాబోతున్నామని మరీ విజయం దక్కేలా చేశారు. తలపతి సక్సెస్ కోసం వ్యూహరచన చేసిన పీకే స్ట్రాటజీతోనే అల్లుఅర్జున్ రాజకీయ బాటలు సిద్ధం చేసుకుంటున్నారని ఇందుకోసం విజయ్ తన అభిమాన సంఘాల ద్వారా ప్రజలకు చేరువై, ఆ తర్వాత పొలిటికల్ ఎంట్రీ ఇచ్చినట్లు ఇప్పుడు బన్నీ కూడా ఇదే ఆలోచనలో ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఏడాది క్రితం కూడా అల్లు అర్జున్ ఈ తరహా మీటింగ్ లు నిర్వహించారు. పుష్ప2 విడుదలకు ముందే అల్లు అర్జున్ పొలిటికల్ ఎంట్రీపై చర్చలు చేయగా, అప్పట్లో మహా పత్రికలో ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. అల్లు అర్జున్ సంధ్య థియేటర్ కేసులో అరెస్ట్ కావడం దేశంలో సంచలనంగా మారగా, అల్లు అర్జున్ పొలిటికల్ ఎంట్రీపై కసిగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఏపీలో మూడో పార్టీకి స్పేస్ ఉందని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అల్లు అర్జున్ అడుగులు ఆసక్తిని కలిగిస్తున్నాయి.




# భారత రైల్వేలో 'హైడ్రోజన్' రైలు కొత్త అధ్యాయం

భారతీయ రైల్వే వ్యవస్థ చరిత్రలో మరో నూతన అధ్యాయం ఆరంభం కానుంది. గ్రీన్ ఎనర్జీ దిశగా అడుగులు వేస్తూ, పర్యావరణ కాలుష్యాన్ని నివారించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'హైడ్రోజన్ రైలు' ప్రాజెక్ట్ ఇప్పుడు తుది దశకు చేరుకుంది. జర్మనీ, జపాన్, చైనా వంటి అగ్రరాజ్యాల సరసన నిలుస్తూ, ఈ అత్యాధునిక సాంకేతికతను సొంతం చేసుకున్న దేశాల జాబితాలో భారత్ చేరబోతోంది. హర్యానాలోని జింద్‌సోనిపత్ మార్గంలో 74010/74009 రైలు నంబర్లతో ఈ రైలు సర్వీసులను ప్రారంభించేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఆమోదం తెలిపింది. జింద్ సిటీ, పాండు పిండారా, గోహానా మీదుగా బర్వాస్ని వరకు సాగే ఈ ప్రయాణం, భవిష్యత్తులో దేశవ్యాప్తంగా హైడ్రోజన్ రైలు రవాణాకు దిక్సూచిగా మారనుంది. గత జూన్ నెలలో ఢిల్లీజింద్ మార్గంలో నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతం కావడంతో, ఈ ప్రాజెక్టుపై రైల్వే శాఖలో నమ్మకం మరింత పెరిగింది. అత్యవసర బ్రేకింగ్ వ్యవస్థలు, రైలు డోలనం వంటి కీలక అంశాలను పరిశీలించిన రైల్వే అధికారులు, మిగిలిన సాంకేతిక పరీక్షలను త్వరలోనే పూర్తి చేయనున్నారు. రీసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ నుండి తుది అనుమతులు లభించిన వెంటనే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ సేవలు అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ కోసం జింద్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో హైడ్రోజన్ నిల్వ, ఇంధనం నింపే సదుపాయాన్ని కూడా రైల్వే శాఖ సిద్ధం చేసింది. పెట్రోలియం మరియు పేలుడు పదార్థాల భద్రతా సంస్థ నిబంధనలకు అనుగుణంగా ఇక్కడ కంప్రెస్డ్ హైడ్రోజన్ గ్యాస్‌ను పంపిణీ చేయనున్నారు. సాంకేతికంగా ఈ రైలు ఒక అద్భుతం. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో రూపుదిద్దుకున్న ఈ రైలు బ్రాడ్ గేజ్ ప్లాట్‌ఫామ్‌పై ప్రపంచంలోనే అతి పొడవైన హైడ్రోజన్ రైలుగా గుర్తింపు పొందనుంది. రెండు 1200 కిలోవాట్ డ్రైవింగ్ పవర్ కార్ల సాయంతో మొత్తం 2400 కిలోవాట్ సామర్థ్యంతో గంటకు 75 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ఇది పరుగులు తీయనుంది. హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ ప్రొపల్షన్ సిస్టమ్ ద్వారా పనిచేసే ఈ రైలు, విద్యుత్తును ఉత్పత్తి చేసే క్రమంలో కేవలం నీటి ఆవిరిని మాత్రమే ఉద్గారంగా విడుదల చేస్తుంది. సంప్రదాయ డీజిల్ రైళ్లు విడుదల చేసే గ్రీన్‌హౌస్ వాయువులు, భారీ శబ్దాలు, మరియు ఎలక్ట్రిక్ రైళ్లకు అవసరమైన ఖరీదైన ఓవర్‌హెడ్ మౌలిక సదుపాయాల సమస్యలకు ఇది ఒక శాశ్వత పరిష్కారాన్ని చూపుతోంది. ఆటోమేటిక్ డోర్లు, డిజిటల్ డిస్‌ప్లేలు, అత్యాధునిక ఇంటీరియర్ డిజైన్‌తో కూడిన ఈ రైలు ప్రయాణికులకు వినూత్న అనుభవాన్ని అందించడమే కాకుండా, కాలుష్య రహిత రవాణా వ్యవస్థకు పునాది వేయనుంది. పచ్చని భవిష్యత్తు వైపు భారత రైల్వే వేస్తున్న ఈ ముందడుగు, దేశాభివృద్ధిలో మరో మైలురాయిగా నిలిచిపోతుందనడంలో సందేహం లేదు.



## బాధిత కుటుంబానికి పోస్టల్ భీమా అందుచేత

**కారేపల్లి, మహా:** కారేపల్లి అంబేద్కర్ నగర్ కాలనీ కి చెందిన చింతల వజ్రం కారేపల్లి పోస్టాఫీస్ లో రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ తీసుకుంది. ఆమె ఇటీవల మృతి చెందటంతో ఆర్పీఎల్ఐ పాలసీ క్లెయిమ్ మొత్తం రూ. 2,19,000/ నామినీ అయిన మృతురాలి భర్త చింతల శ్రీను కు సబ్ పోస్ట్ మాస్టర్ కే. ప్రశాంత్, ఏజెంట్ ఎండీ. రియాజ్ లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోస్టల్ శాఖ ద్వారా అనేక సేవలు అందించటం జరుగుతుందన్నారు. అనేక పొదుపు పథకాలు,భీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలు పోస్టల్ శాఖ ద్వారా పారదర్శకంగా అమలు జరుగుతున్నాయని తెలిపారు.

# పాయల్ శంకర్ భూకబ్జాను బీజేపీ నేత సమర్థిస్తున్నారు

- కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ మంగేష్
- ఎమ్మెల్యే మెప్పు కోసమే నగేష్ ఆరాటం
- ప్రజాభవన్ ను కూల్చుతామన్న వ్యాఖ్యలపై మండిపాటు
- అది కంది శ్రీనివాస రెడ్డి స్వంత డబ్బులతో నిర్మించారని వెల్లడి
- నిజాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు



**ఆదిలాబాద్ మహా:** 72\3 సర్వేనంబర్ లో ఆదిలాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాయల్ శంకర్ భూకబ్జాపై కాంగ్రెస్ పార్టీ కలెక్టర్ ఎస్పీకి , అడిషనల్ కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన విషయంపై బీజేపీ నాయకుడు ఎన్నాల నగేష్ ప్రెస్ మీట్ లో చేసిన వ్యాఖ్యలు ఆదిలాబాద్ ప్రజలను తప్పుదోవ పట్టించేవిధంగా ఉన్నాయని కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ మంగేష్ అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.ఆ స్థలం ప్రభుత్వ భూమి అని క్రయవిక్రయాలకు ఎలాంటి ఆస్కారం లేదని జిల్లా కలెక్టర్ ఉత్తర్వులున్నా ఎమ్మెల్యే అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. తన భార్య పేరుపై ఏకంగా 11 ప్లాట్లను ఎన్వోసి రద్దు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని మీడియాకు ఆధారాలు చూపించారు.అంతే కాకుండా అదే సర్వే నంబర్ లో తన అల్లుడు సిద్దార్థ పేరుపై నాలుగు మరో రెండు ప్లాట్లను తన పనివాళ్ళ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించారు. ఈ విషయంపై త్వరలో కలెక్టర్ ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.పాయల్ శంకర్ పై ఎలాంటి ఆరోపణలొచ్చినా వెంటనే ప్రెస్ మీట్ పెట్టి ఖండించే నగేష్ కు ఈ విషయాలు తెలియదా అని ప్రశ్నించారు. కేవలం ఎమ్మెల్యే మెప్పు పొందేందుకే నగేష్ మీడియా ముందుకు వస్తున్నారన్నారు.ఒక బీసీ ఎమ్మెల్యే డబ్బులు సంపాదిచుకోవద్దా అని ప్రశ్నిస్తున్నారని న్యాయంగా సంపాదించుకుంటే తమ కేమీ అభ్యంతరం లేదని కాని ప్రభుత్వ భూములను కబ్జా చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమన్నారు.అలాగే ప్రజాభవన్ కూలగొడతామంటూ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు.ఆయన తన స్వంత డబ్బులతో ప్రజల సేవ కోసం భవనం నిర్మించుకున్నారని, ఆయన ఆరోపించినట్టు అక్రమంగా ఏదీ లేదన్నారు.దానికి సంబంధించిన డాక్యుమెంట్లన్నీ తమ వద్ద ఉన్నాయన్నారు. అంతే కాకుండా ఆయన గత నాలుగేళ్లుగా ప్రజాసేవాభవన్ ఆవరణలో పేదలకు అన్నదానం చేస్తున్నారని ఇప్పటివరకు కొన్ని లక్షలమంది ఆకలి తీర్చారని అన్నారు. అలాంటి వ్యక్తి పై తప్పుడు ఆరోపణలు చేయడం సరి కాదన్నారు.నిజాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. మీ పార్టీ కార్యాలయ స్థలం పైనే అనుమానాలున్నాయని నిజంగా అది సక్రమమే అయితే ప్రారంభోత్సవానికి రాష్ట్ర పార్టీ పెద్దలు ఎందుకు రాలేదని ప్రశ్నించారు.ఒక న్యాయవాదిగా మీకు అన్నీ తెలిసినా ఎమ్మెల్యే ను సమర్థిస్తూ వ్యాఖ్యలు చేయడాన్ని మీ విజ్ఞత కే వదిలేస్తున్నామని అన్నారు. ఈ మీడియా సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఖిజర్ పాషా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఇజ్జగిరి సంజయ్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, కౌన్సిలర్ మహబూబ్ , నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, శాంతన్ రావు , ఎంఏ షకీల్, నిమ్మల గౌతమ్ రెడ్డి, పోతారెడ్డి , మంచాల మల్లయ్య,ప్రభాకర్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ సందర్శించిన ఎస్పీ
- పోలీస్ సిబ్బందికి పలు సూచనలు
- స్టేషన్ పరిసరాలు శుభ్రంగా ఉండాలి
- భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల సమస్యల పరిష్కారానికై ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ ను శుక్రవారం ఎస్పీ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి పరిశీలించారు. సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి పోలీసు సేవలను మరింత వేగవంతంగా పారదర్శకంగా అందించాలని సూచనలు చేశారు. సీఐఈఆర్ పోర్టల్ వినియోగంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్ పరిధిలోని క్రైమ్ ప్రాపర్టీని పరిశీలించి వాటి భద్రత నిర్వాహనపై అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. పెట్రోలింగ్ బ్లూ కోల్ట్స్ వాహనాలతో సంచరిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. డయల్ 100కు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ, చుంచుపల్లి సీఐ ఆర్.వెంకటేశ్వర్లు, ఎస్సైలు అఖిల, రాజమౌళి సిబ్బంది పాల్గొన్నారు.



## వర్షా కాలం నేపథ్యంలో ప్రత్యేక చర్యలు

**ఆదిలాబాద్ మహా:** రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాధన ఆధ్వర్యంలో అదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనుష మాట్లాడుతూ.. గతంలో అదిలాబాద్ పట్టణంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల కేసులు నమోదైన నేపథ్యంలో ఈ ఏడాది ముందస్తు జాగ్రత్త చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఇందుకోసం ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు,వైద్య సిబ్బంది,మున్సిపల్ సానిటేషన్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు.ప్రతి వారం కనీసం మూడు రోజుల పాటు కాలనీల్లో పర్యటించి ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని, అపరిశుభ్ర ప్రాంతాలను గుర్తించి వెంటనే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన చోట్ల బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల నివారణకు ప్రత్యేక రసాయనాలను పిచికారీ చేయడం, నీటి నిల్వల్లో లార్వా నివారణ కోసం ఆయిల్ బాల్స్ మరియు మందులను వినియోగించాలని అధికారులను ఆదేశించారు.అలాగే ప్రజలు జ్వరం, దగ్గు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్‌గౌడ్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, మున్సిపల్ సానిటేషన్ ఎస్ఐ శంకర్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అవగాహన లేని బీఎల్ఎలతో ఓటర్లు అవస్థలు

- జులై 24 నాటికి ఫామ్‌లు నింపడం ఆన్ లైన్ చేయడం పూర్తి అయ్యేనా..?




**మంచిర్యాల, మహా** :రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్.ఐ.ఆర్.) ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. జులై 24 చివరి తేదీ దగ్గరపడుతున్నాకూడా ఫామ్‌లు నింపడంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి బూత్‌కు ఒక బి.ఎల్.ఓ. ను రెవెన్యూ అధికారులు ప్రకటించారు. వీరికి సహాయకులుగా అధికార కాంగ్రెస్ పార్టీ నుండి ఒకరు, భారత రాష్ట్ర సమితి నుండి ఒకరు, భారతీయ జనతా పార్టీ నుండి ఒకరు బూత్ లెవల్ ఏజెంట్ (బి.ఎల్.ఎ) ల లిస్టును రెవెన్యూ అధికారులు సిద్ధం చేశారు. అయితే బి.ఎల్.ఎ.లకు సరైన శిక్షణ, అవగాహన ఇవ్వకపోవడంతో వారికే ఫామ్‌లు ఎలా నింపాలో తెలియడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో మొత్తం భారం బి.ఎల్.ఓ.లపై పడుతోందని తెలుస్తోంది.

**ఫామ్‌లు నింపడం తెలియదు**

గత నెల 25 నుండి బి.ఎల్.ఓ.లు, కొంతమంది నేతలు ఫామ్‌లను ఇంటింటికి పంచుతున్నప్పుడు ఫోటోలు దిగి వెళ్లారే తప్ప ఓటర్లకు అవగాహన కల్పించలేదని తెలుస్తోంది. ఆ తర్వాత బి.ఎల్.ఓ.లు ప్రజలకిచ్చిన ఫామ్ లను సేకరించేందుకు వెళ్లేసరికి తిరిగి అదే ఫామ్‌లను ఓటర్లు ఇస్తున్నట్లు సమాచారం. ఇచ్చిన ఫామ్‌లను ఎలా పూర్తి చేయాలో తెలియక వృద్ధులు, చదువురాని వారు బి.ఎల్.ఎ.లను ఆశ్రయిస్తే మాకు ఫామ్‌లు నింపడం తెలియదు, బి.ఎల్.ఓ.ని అడగండి వారే రింపి ఇస్తారు అని చేతులు ఎత్తేస్తున్నారని ఓటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బి.ఎల్.ఓ.ల ఆవేదన:**

కాంగ్రెస్, బి.ఆర్.ఎస్, బి.జె.పి.లకు చెందిన బి.ఎల్.ఎ.ల సహాయంతో ఎస్.ఐ.ఆర్. ఫామ్‌లను నిర్ణీత గడువులోపు పూర్తి చేస్తామని ఆశించిన బి.ఎల్.ఓ.లు ప్రస్తుత పరిస్థితులను చూసి ఒత్తిడికి గురవుతున్నట్లు తెలుస్తోంది. మాకు సహాయం చేయాల్సింది పోయి మాకే అదనపు భారం అయ్యారని కూలిపోతున్నట్లు కథనాలు వినిపిస్తున్నాయి. బిఎల్ఎలకు శిక్షణ లేకుండా నియమించడంతో 24 లోపు అన్ని ఫామ్‌లు పూర్తి చేయడం కష్టంగా ఉందని పలువురు బి.ఎల్.ఓ .లు వాపోయారని తెలుస్తోంది.

**ప్రజల డిమాండ్**

ప్రతి ఎన్నికల బూత్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, అందులో బి.ఎల్.ఎ.లకు, ఓటర్లకు రెవెన్యూ అధికారులు అవగాహన కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం విధించిన గడువులోపు ఫామ్‌లు పెండింగ్‌లో ఉంటే అర్హులైన ఓటర్లకు ఓటు హక్కు దూరమయ్యే ప్రమాదం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. అలా కాని పక్షంలో ఫామ్‌లను సేకరించే సమయాన్ని పెంచాలని ఓటర్లు కోరుతున్నారు.

### నేతలపై మంత్రి ఆగ్రహం

ఎస్ఐఆర్ ఫామ్ ల ఆన్ లైన్ ప్రక్రియ ఆలస్యం అవుతుంటే అధికార పార్టీకి చెందిన బూతులేవల్ అధికారులు ఏం చేస్తున్నారని చెన్నూరు ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి తమ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రతి బూత్ లెవెల్ బిఎల్ఎ లు ఓటర్ల చేత ఫామ్ లో పొందపరచిన అన్ని విషయాలను పూర్తి చేపించేలా చొరవ చూపాలని మంత్రి అనుచర వర్గానికి హితబోధ చేసినట్లు సమాచారం. ఒకవేళ ఓటర్లు సర్ ఫామ్ లో తప్పుగా నమోదు చేసుకుంటే రేషన్ సరుకులు, పెన్షన్, ఇతర ప్రభుత్వ రాయితీలు అందించడంలో మును ముందు చాలా సమస్యలు ఎదురవుతాయని చెప్పినట్లు కథనం.

## విద్యాసంస్థల బంద్ నిర్వహించిన విద్యార్థి సంఘాలు

**ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్**




**యాదాద్రి భువనగిరి, జూలై 10 (మహా):** ప్రభుత్వ పాఠశాలల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు లావుడియా రాజు, ఉప్పుల శాంతికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం భువనగిరిలో విద్యాసంస్థల బంద్ నిర్వహించి ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడిచినా విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందలేదని ఆరోపించారు. మధ్యాహ్న భోజన పథకానికి తగిన నిధులు కేటాయించి నాణ్యమైన భోజనం అందించాలని, శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని కోరారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలని, విద్యార్థులపై అదనపు భారం మోపకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కేఆర్కే కాలనీలో ఫ్రైడే'డ్రైడే

**ఆదిలాబాద్ మహా :** ప్రతీ ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బండారి అనూష అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో ఫ్రైడే'డ్రైడే'లో భాగంగా శుక్రవారం సీజనల్ వ్యాధుల నివారణపై చేపట్టిన అవగాహన ర్యాలీలో కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ ,కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆమె పాల్గొన్నారు. కెఆర్కే కాలనీలో నెలకొన్న అపరిశుభ్ర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సుమారు రూ.40 లక్షల నిధులతో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఇందుకోసం 50 మంది ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికులు, ట్రాక్టర్లు, జేసీబీలు ఇతర యంత్రాలను అత్యవసరంగా వినియోగంలోకి తీసుకువచ్చామన్నారు. ఈ ప్రత్యేక సిబ్బందిని కెఆర్కే కాలనీతో పాటు అదిలాబాద్ పట్టణంలోని 49 వార్డులలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకు వినియోగించనున్నట్లు తెలిపారు.రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఇళ్ల స్లాబులపై, డాబాలపై, కొబ్బరి బొండాలు, కూలర్లు, ఇతర పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమల లార్వా పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.కార్యక్రమంలో భాగంగా కెఆర్కే కాలనీ మొత్తం బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ప్రత్యేక సానిటేషన్ స్ప్రే చేయడం, అవసరమైన రసాయనాలను పిచికారీ చేయడం వంటి చర్యలు చేపట్టారు.

# మహిళల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**ఆదిలాబాద్ మహా:** మహిళల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఉమెన్స్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసులు, ఫిర్యాదుల పరిష్కార విధానం, పోలీస్ స్టేషన్ నిర్వహణ, పరిశుభ్రతను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి మహిళా ఫిర్యాదుదారుతో గౌరవంగా, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను పూర్తిగా తెలుసుకుని వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా భార్యాభర్తల మధ్య తలెత్తే కుటుంబ వివాదాల విషయంలో అత్యంత సున్నితంగా వ్యవహరిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా కౌన్సెలింగ్, చట్టపరమైన చర్యలను సమన్వయంతో చేపట్టాలని తెలిపారు. మహిళల రక్షణ, భద్రతకు ఉమెన్ పోలీస్ స్టేషన్ కీలకమని , ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా తీసుకుని బాధితుల్లో విశ్వాసం కల్పించే విధంగా పనిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని, కేసుల దర్యాప్తును నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె ఫణిదర్, ఏఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు






## సర్పంచ్ ల పాత్ర కీలకం

**నిర్మల్ మహా:** గ్రామాల పారిశుద్ధ్య నిర్వహణలో సర్పంచ్ ల పాత్ర కీలకమని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అన్నారు.శుక్రవారం నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలోని తరోడ గ్రామంలో గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సర్పంచ్ లకు గ్రామ పరిపాలన అంశాలపై స్పష్టమైన అవగాహన ఉండాలని పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అత్యంత కీలకమని వివరించారు. ఇందుకోసం సర్పంచ్ లు కృషి చేయాలని అన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణ అంశంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలని వివరించారు. తడి పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలన్నారు. చెత్త నుంచి సేంద్రియ ఎరువుల తయారీ, ఆదాయ సృష్టి చేసుకోవచ్చని అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి అంకిత భావంతో కృషి చేయాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిఆర్డిఓ విజయలక్ష్మి, పంచాయతీరాజ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**పాలకుర్తి, జూలై 10 మహా** రైతు ఆశీర్వాద సభను ప్రత్యక్ష ప్రసారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద కేవలం 9 రోజుల్లో రూ.9,000 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం అభినందనీయమని మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా చింతకాని నుంచి పాల్గొన్న సభను రైతులు వీక్షించారు. నిధులు సకాలంలో అందడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణానికి అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని అధికారులు రైతులకు సూచించారు.







# వంద శాతం హాజరు లక్ష్యంగా..

**ఆదిలాబాద్ మహా** : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు వంద శాతానికి పెంచడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పని చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలోని వెటర్నరీ ఆసుపత్రి భవనంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కేటాయించిన తరగతి గదులను మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, డీఈఓ మాధవితో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 15 ఏళ్లుగా మూతపడి ఉన్న 13 పాఠశాలలను తిరిగి ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ బడుల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందనీ, బడికి నూతన ఫర్నిచర్‌ను అందించడంతో పాటు, విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం వడ్డించేందుకు వీలుగా త్వరలోనే ప్రత్యేక షెడ్డును నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇక్కడ ప్రీప్రైమరీ తరగతులను సైతం ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. పాఠశాల పునఃప్రారంభానికి కృషి చేసిన స్థానికులను, రిటైర్డ్ ఉద్యోగులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.అనంతరం వయోవృద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిళ్లు, ప్లేట్లను పంపిణీ చేశారు. అంతకుముందు పశువైద్యశాల ఆవరణలో రూ.2 లక్షలతో నిర్మించిన షెడ్డును కలెక్టర్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ రోహిత్, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి రామారావు రాథోడ్, ఏడీ గోపీకృష్ణ, ఎంఈఓ సోమయ్య, వయోవృద్ధుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డా. దేవీదాస్ దేశ్‌పాండే, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




# రైతు భరోసా సంబరాలు

**సీఎం చిత్రపటానికి పాలాభిషేకం**

**కుక్కలగూడూరు, జూలై 10 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలం లోని రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సహాయం నిధులు విడుదలైన సందర్భంగా కుక్కలగూడూరు గ్రామం లో గ్రామ సర్పంచ్ మేడం దేవమ్మ బాపు ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా,హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ఎమ్మెల్యే మక్కాను సింగ్ రాజ్ ఠాగూర్ చిత్రపటానికి పాలాభిషేక కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ మేడం దేవమ్మ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతన్నలకు అండగా నిలిచిందని కొనియాడారు. ఈ నిధులు వ్యవసాయ పెట్టుబడులకు ఎంతో ఆసరాగా నిలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ నినాదాలు చేశారు



# రైతు భరోసా నిధులు విడుదలపై హర్షం

**కొత్తపల్లి జూలై 10 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని రైతు భరోసా పథకం కింద రైతులకు నిధులు విడుదలైన సందర్భంగా ఈరోజు కొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఘనంగా పాలాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ నిర్ణయంపై రైతులు, కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు,రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ.రైతు భరోసా పథకం రైతుల సాగు పెట్టుబడులకు ఎంతో ఊరటనిస్తుందని, ఈ నిధులు వ్యవసాయానికి ఎంతో ఉపయోగకరంగా మారుతాయని కొనియాడారు. భవిష్యత్తులో కూడా రైతాంగానికి మరిన్ని సంక్షేమ పథకాలు,అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు . ఈ కార్యక్రమంలో కొత్తపల్లి సర్పంచ్ తోట స్వప్న మహేష్, ఉప సర్పంచ్ బండ కుమార్, గ్రామ శాఖ అధ్యక్షులు అమ్ముల కుమార స్వామి, ఉపాధ్యక్షులు అమ్ముల శ్రీనివాస్, యూత్ ప్రెసిడెంట్ మల్లెత్తుల కొటేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# జన్ను శ్యామ్ సేవలు అభినందనీయం

**శ్యామ్ ను సత్కరించిన మాజీ ఎమ్మెల్సీ**

**మహా వరంగల్ ;** కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా, గత కొన్ని సంవత్సరాలుగా పార్టీనే నమ్ముకుని ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న 25వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడి కృషిని ఆయన సేవలను మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు గుర్తించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా చేరవేయడంలో 25వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు జన్ను శ్యామ్ కీలక పాత్ర పోషిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ప్రశంసించారు. పార్టీ కార్యక్రమాలలో ప్రజలతో నేరుగా మమేకమై, ప్రభుత్వ పథకాల పై ప్రజలకు అవగాహన కల్పించడంలో జన్ను శ్యామ్ చూపిస్తున్న చురుకుదనాన్ని గుర్తించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్, వరంగల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాష్ లు శుక్రవారం ఆయనను మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు వద్దకు ప్రత్యేకంగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జన్ను శ్యామ్ కొండా మురళీధర్ రావు కు శాలువా కప్పి సన్మానించే క్రమంలో తిరిగి జన్ను శ్యామ్ ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కొండా మురళి మాట్లాడుతూ జన్ను శ్యామ్ యువ నాయకుడిగా పార్టీకి మంచి పేరు తీసుకొస్తున్నారని, ఇదే స్ఫూర్తితో ఇక ముందు కూడా పార్టీ కోసం ప్రజల కోసం ఇలాగే పనిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం జన్ను శ్యామ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని, పార్టీ ఆదేశాల మేరకు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్ తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మల్లాపూర్‌లో బాక్స్ డైన్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

**కుషాయిగూడ, మహా :** పాత మీర్ పేట్ హెచ్‌బీ కాలనీలోని అన్నపూర్ణ కాలనీ పంచముఖ హనుమాన్ ఆలయం నుంచి ఓల్డ్ మీర్ పేట్ హనుమాన్ ఆలయం వరకు నిర్మించనున్న బాక్స్ డ్రైన్ పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.అనంతరం ఎమ్మెల్యే కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీ, మంచినీటి సరఫరా, విద్యుత్ తీగల మార్పు తదితర సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని మున్సిపల్, జలమండలి, విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాక్స్ డ్రైన్ నిర్మాణం పూర్తయితే వర్షపు నీరు నిల్వ లేకుండా సాఫీగా వెళ్లిపోవడంతో పాటు డ్రైనేజీ నీరు రోడ్లపైకి వచ్చే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.కార్యక్రమంలో జలమండలి డీజీఎం వేణుగోపాల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, కాలనీ అధ్యక్షుడు పాండాల నరసింహగౌడ్, కార్యదర్శి సంజయ్ నాయక్‌తో పాటు పలువురు స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



# గ్రామ పంచాయతీ ప్రణాళికల తోనే గ్రామాల అభివృద్ధి

- సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



**హనుమకొండ మహా;** గ్రామాల అవసరాలకు అనుగుణంగా రూపొందించే గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు.శుక్రవారం దామెర మండలంలోని ఏఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ సమగ్ర ప్రణాళికపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

గ్రామాల అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్ వాడీ కేంద్రాలు, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు రహదారులపై నిల్వ కాకుండా ఇంకుడు గుంతలు, కాలువల ద్వారా నీటి పారుదల వ్యవస్థను మెరుగు పర్చాలని సూచించారు. జిల్లాలో వర్షపాతం తక్కువగా ఉన్న నేపథ్యంలో వ్యవసాయ శాఖతో సమన్వయం చేసుకుని రైతులను వాణిజ్య పంటల సాగు వైపు ప్రోత్సహించాలని తెలిపారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా పైప్‌లైన్ లీకేజీలను వెంటనే మరమ్మతు చేయాలని ఆదేశించారు.గ్రామ పంచాయతీలు తమ పరిధిలోని సహజ వనరులు, స్థానిక ఆదాయ వనరులను గుర్తించి స్వంత ఆదాయాన్ని పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని, ఆర్థికంగా బలోపేతమైన గ్రామ పంచాయతీలతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన నిర్వహించాలని, గ్రామసభల్లో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని, ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు కలిగిన ప్రతి అర్హ కుటుంబానికి 125 రోజుల ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ఈ పథకం సమర్థవంతంగా ఉపయోగపడేలా కృషి చేయాలని అన్నారు.

**పత్రాల కే పరిమితం కావద్దు**

గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కేవలం పత్రాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితాలిచ్చేలా సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అలాగే 16వ ఆర్థిక సంఘం నిధులను పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని సూచించారు.

అనంతరం జాయింట్ కలెక్టర్ రవి మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి బీఎల్ఓలకు సర్పంచులు, ప్రజాప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఎలాంటి సందేహాలు ఉన్నా మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ల ద్వారా వివరాలు తెలుసుకుని ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. పార్టీలకు అతీతంగా అందరూ సహకరించి ఎస్ఐఆర్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ శేషాద్రి జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి నమాకాంత్. తాహసిల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి. కల్పన తదితరులు పాల్గొన్నారు

# చేవెళ్లలో విద్యాసంస్థల బంద్ విజయవంతం..

- వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు
- విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతం కావడం జరిగిందని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. విద్యారంగంలో నెలకొన్న అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపులో భాగంగా శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలో వ్యాప్తంగా నిర్వహించిన విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ... విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ప్రభుత్వం మరియు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడంలో పాలకులు విఫలమయ్యారని ఆయన విమర్శించారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా విద్యా శాఖ అధికారులు స్పందించి, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో వామపక్ష విద్యార్థి సంఘాలు ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బంద్‌కు సహకరించిన విద్యాసంస్థల యాజమాన్యాలకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సహాయ కార్యదర్శి మణి గౌడ్, చేవెళ్ల పిడిఎస్యు డివిజన్ అధ్యక్షులు న్యాలట అశోక్,అనిల్ యమ్,అశోక్, శివప్రసాద్, అశోక్ , ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు పవన్ గౌడ్, దశరథ్,బన్నీ, ఫయాజ్, ఫరీద్, వరుణ్, వినయ్, రమేష్, అశోక్, కార్తీక్, కిరణ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

**ఇబ్రహీంపట్నం జూలై 10 మహా:** సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని దానిని నిరుపేదలు సద్వినియోగం చేసుకొని సాయం పొందాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇబ్రహీంపట్నం ఏఎంసీ డైరెక్టర్ దొంతరమోని రాజు అన్నారు. ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పదవ వార్డ్ ఖానాపూర్ గ్రామానికి చెందిన పండి చందు అనే లబ్ధిదారునికి 51 వేల విలువైన చెక్కులు మంజూరు కాగా, శుక్రవారం లబ్ధిదారునికి రాజు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో నేరుగా లబ్దిదారులకు చేరుతున్నాయని, అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని దానిని నిరుపేదలు సద్వినియోగం చేసుకొని సాయం పొందాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేద ప్రజలకు, రైతులకు మహిళలకు న్యాయం జరుగుతుందని, భవిష్యత్తులో పేదలకు మరిన్ని పథకాలు అందించడం జరుగుతుందని అన్నారు.

# అక్రమ మొరం రవాణా కు చెక్ పెట్టిన పోలీసులు

**మూడు టిప్పర్లు సీజ్ చేసిన హసన్ పర్తి పోలీసులు**

**హన్మకొండ మహా ;** ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ (మొరం) రవాణా చేస్తున్న మూడు టిప్పర్లను శుక్రవారం హసన్‌పర్తి పోలీసులు సీజ్ చేశారు. నల్లగట్టు వై జంక్షన్ వద్ద హెడ్ కానిస్టేబుల్ ఆర్. శంకరయ్య బృందం పెట్రోలింగ్ చేస్తుండగా, ఎల్కతుర్తి నుండి హనుమకొండకు అక్రమంగా మొరం తరలిస్తున్న ఈ వాహనాలు పట్టుబడ్డాయి. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ఆదేశాల మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ పి. గోవర్ధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వాహన డ్రైవర్లు పి. రాజు, పి. శ్రీనివాస్, కె. కార్తీక్ లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అనుమతులు లేకుండా ఇలాంటి మొరాన్ని అక్రమంగా తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ హెచ్చరించారు.



# జిల్లాలోని బస్తీ దవాఖానలలో వైద్య సేవలు..!

- ప్రజలు బస్తి దావఖానను సద్వినియోగం చేసుకోవాలి
- బస్తి దావఖానలో వైద్య సేవలు మెరుగుపరచాలి
- జిల్లా డిఎంహెచ్ఓ డా. స్వర్ణ కుమారి ఆదేశం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జిల్లాలోని బస్తీ దవాఖానలలో వైద్య సేవలను మెరుగుపరచాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణ కుమారి ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి (డీఎం&హెచ్ఓ) డా. స్వర్ణ కుమారి ఈరోజు పాండురంగ నగర్ మరియు బుద్వేల్ బస్తీ దవాఖానలను ఆకస్మికంగా సందర్శించి అక్కడ అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓపీ సేవలు, ఔషధాల లభ్యత, ప్రయోగశాల సేవలు, రోగుల నమోదు, గర్భిణీలు మరియు చిన్నారులకు అందిస్తున్న ఆరోగ్య సేవలు, టీకాల కార్యక్రమం, వైద్య సిబ్బంది హాజరు, పరిశుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.vరోగులకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని, ప్రతి రోగిని మర్యాదపూర్వకంగా ఆదరించి చికిత్స అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులపై ప్రత్యేక అప్రమత్తతతో పనిచేయాలని, జ్వరం, డెంగ్యూ, మలేరియా వంటి లక్షణాలతో వచ్చే రోగులను వెంటనే గుర్తించి అవసరమైన చికిత్స అందించాలని ఆదేశించారు.బస్తీ దవాఖానల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగించాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని డా. స్వర్ణ కుమారి సూచించారు. ఈ తనిఖీల సందర్భంగా సంబంధిత వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు: బీఆర్ఎస్

రాజేంద్రనగర్‌లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సువర్ణ, సుమ కుటుంబాలను బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కోలాన్ ప్రదీప్ రెడ్డి పరామర్శించారు. స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యం, అండర్‌పాస్ నిర్మాణంలో లోపాల వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.






# కోహెడలో ఎగుమతి ఆధారిత చేపల మార్కెట్ శంకుస్థాపన...

- రెండున్నరేళ్లలో వేలకోట్లతో నియోజకవర్గం అభివృద్ధి...
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి


**ఇబ్రహీంపట్నం జూలై 10 మహా :** ముదిరాజుల అభివృద్ధి కోసం మంత్రి, ఎమ్మెల్యే పదవికే కాదు.. ప్రాణం ఇవ్వడానికైనా సిద్ధమని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ముదిరాజుల సంక్షేమం కోసం పాటుపడతానన్నారు. రంగారెడ్డి జిల్లా జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ కోహెడలో రూ.47.03 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ చేపల మార్కెట్ శంకస్థాపన కార్యక్రమం మంత్రి చేతుల ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, ఫ్రూట్ మార్కెట్ చైర్మన్ చిలుక మధు, రంగారెడ్డి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దూస వెంకటేష్, ఫిషరీస్ అడిషనల్ డైరెక్టర్ మురళీకృష్ణ, అడిషనల్ కలెక్టర్ చంద్రా రెడ్డి, ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి, పెద్దఎత్తున మత్స్యకారులు పాల్గొన్నారు. మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మత్స్య రైతులకు ఈ సందర్భంగా నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

**చరిత్రాత్మక ప్రాజెక్టుగా పేర్కొన్న మంత్రి** మత్స్యకారుల సమగ్ర అభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. అత్యధిక జనాభా ఉన్న మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఉందన్న ఆయన.... మత్స్యకారుల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన ముదిరాజుల సంక్షేమం కోసం పాటుపడుతానని చెప్పారు. తెలంగాణ మత్స్య రంగ చరిత్రలో మరో చారిత్రక ఘట్టంగా నిలిచే కోహెడలో అంతర్జాతీయ మంచినీటి చేపల ఎగుమతుల కేంద్రం శంకుస్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. సముద్రతీర ప్రాంతం కాకుండా దేశంలోనే తొలిసారిగా అంతర్గత రాష్ట్రంలో ఇటువంటి ఆధునిక ఎగుమతుల కేంద్రం ఏర్పాటు కావడం తెలంగాణకు గర్వకారణంగా పేర్కొన్నారు.

**మత్స్యకారుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం: ఎమ్మెల్యే మల్ రెడ్డి**

పదేళ్ల భారాస హయాంలో చేపపిల్లలను చూపించి, చెరువుల్లో మట్టిని అమ్ముకున్నారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఉన్న వారు భూములన్నీ కబ్జా చేస్తే, కాంగ్రెస్ హయాంలో 200కోట్ల విలువైన కోహెడలోని భూమిని మత్స్యకారుల అభివృద్ధి కోసం కేటాయించినట్లు చెప్పారు. ఇదే తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా పేర్కొన్నారు. పదేళ్ల పాటు పాలించిన వారు మత్స్యకారుల కోసం ఇలాంటి మార్కెట్ ను ఎందుకు కట్టించలేదో అడగాలని ప్రశ్నించారు. విలువైన భూమిని కేటాయించినందున మరో యాభై కోట్ల ప్రాజెక్టును ఇక్కడకి తీసుకురావాలని మంత్రి శ్రీహరిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కోరగా.... పూర్తయ్యే వరకు మరో ప్రాజెక్టు తెచ్చే బాధ్యత తనదని మంత్రి హామీ ఇచ్చారు.

# ఈ నెల 24 లోగా ఎన్యుమరేషన్ ఫారాలను తిరిగి ఇవ్వాలి... ఈఆర్ఓ, శ్రీనివాస్ రెడ్డి..




**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ నియోజకవర్గ ఓటర్లందరు ఈ నెల 24వ తేదీ లోగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ ఓ) లు ఇచ్చిన ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి తిరిగి బీఎల్ ఓ లకు పాస్ పోర్ట్ సైజు ఫోటో పెట్టి ఇవ్వాలి, అలా ఇచ్చిన వారి పేర్లు మాత్రమే జూలై 31న విడుదల చేసే ఓటరు జాబితా డ్రాఫ్ట్ లో ఉంటాయని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ) సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ, శుక్రవారం భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నిర్వహించిన సమీక్షా సమావేశంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా ఎన్యుమరేషన్ ఫారాలను (ఈఎఫ్) డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు.జూలై 24 లోగా ఓటర్లనుంచి వచ్చిన ఎన్యుమరేషన్ ఫారాలన్నింటిని అప్లోడ్ చేయాల్సి ఉంటుంది.ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకుని మెల్లిగా పూర్తి చేసి ఇస్తామంటే త్వరలో వచ్చే డ్రాఫ్ట్ లో ఉండదన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఒక ఈఆర్ఓ, ఏడుగురు ఏఈఆర్ లు, 55 మంది సూపర్వైజర్లు, 547 మంది బీఎల్ఓ లు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి తిరిగి తీసుకునే పనిలో ఉన్నారు.రాజకీయ పార్టీల నుంచి నియమితులైన బీఎల్ఏ లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యవజన సంఘాలు, ఓటర్లను చైతన్యం చేసి సకాలంలో ఎన్యుమరేషన్ ఫారాలను అందజేసే విదంగా చూడాలన్నారు. ఈనెల 24 తేదీ వరకు ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి ఇవ్వకపోతే ఆగస్టు లో అన్ని దృవీకరణ పత్రాలు పెట్టి ఫారం( 6) సమర్పించాల్సి ఉంటుంది, అలా చేసిన వారి పేరు అక్టోబరు లో వచ్చే తుది ఓటరు జాబితా లో పొందుపరచడం జరుగుతుందన్నారు. అలా కాకుండ ఈ నెల 24లోగా ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తే బాగుంటుందన్నారు.ఇతర సమాచారం కోసం... క్రింద ఇచ్చిన ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

**ఏఈఆర్ ఓ ల పేర్లు, ఫోన్ నెంబర్లు ...**

ఎన్ శ్రీనివాస్ రెడ్డి, ఏఈఆర్ఓ (గండిపేట్ తహసీల్దార్) 7995086358
జి లక్ష్మారెడ్డి, ఏఈఆర్ఓ (డిప్యూటీ కమిషనర్, నార్సింగి) 9121529597
బి సురేందర్ రెడ్డి, ఏఈఆర్ ఓ (డిప్యూటీ కమిషనర్, రాజేంద్రనగర్) 8712499 189
బొమ్మ రాములు, ఏఈఆర్ఓ (తహసీల్దార్, రాజేంద్రనగర్) 9849904231
మల్లయ్య, ఏఈఆర్ఓ (డిప్యూటీ కమిషనర్, అత్తాపూర్) 6309529286
సుమన్ రావు, ఏఈఆర్ఓ (డిప్యూటీ కమిషనర్, శంషాబాద్) 7337336191
అమర్ లింగం గౌడ్, ఏఈఆర్ఓ (తహసీల్దార్, శంషాబాద్) 9849904287




# ఓటరు జాబితా సవరణను వేగవంతం చేయాలి

- **ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి**
- **భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ**

మహా వరంగల్ బ్యూరో; ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించి, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ ఎన్నికల అధికారులను ఆదేశించారు. శుక్రవారం న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డితో కలిసి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి వరంగల్ జిల్లా నుంచి జిల్లా ఎన్నికల అధికారి, డాక్టర్ సత్య శారద జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి ఈ నెల 24వ తేదీలోగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేయాలని సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ లో భాగంగా ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1,200 మందికి మించి ఓటర్లు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 99.06 శాతం, డిజిటలైజేషన్ 33.31 శాతం పూర్తయిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి వివరించారు. ప్రతి బీఎల్ఓ రోజుకు కనీసం 15 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని చేరుకోవాలని, ప్రతి బీఎల్ఓ కు ముగ్గురు వాలంటీర్ల తో బృందాలను ఏర్పాటు చేసి ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,ఆర్డీవోలు వరంగల్ సుమ,నర్సంపేట ఉమారాణి, ఎన్నికల సూపరిండెంట్ రజిని సంబధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు..



# గ్రామ అభివృద్ధి లో సర్పంచ్‌ల పాత్ర అత్యంత కీలకం

- **వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద**

**మహా వరంగల్ బ్యూరో;** గ్రామపంచాయతీలలో సమగ్ర గ్రామ అభివృద్ధి ప్రణాళిక ను సమర్థవంతంగా రూపొందించి అమలు చేయడంలో సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. నర్సంపేటలో సిటిజన్ క్లబ్ లో శుక్రవారం గ్రామపంచాయతీ, సమగ్ర గ్రామ అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతలను గుర్తించి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు తదితర అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ గ్రామాభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయాలని తెలిపారు. ప్రస్తుతం సమగ్ర ఓటరు ఇంటింటి సర్వే లో సర్పంచ్ లు ముందుగా మీరు ఓటరు ఫారం నమోదు చేసి డిజిటల్సిజేషన్ చేయించుకోవాలని,తద్వారా ప్రజల సందేహాలను కూడా నివృత్తి చేయగలరని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులకు రానున్న వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రభుత్వం సూచనలు పాటిస్తూ పంట మార్పిడి పంటలు వేయాలని, నీటి తక్కువ వినియోగం తో పండించే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. భూగర్భ జలాలను ఇంకిపోకుండా ఉండేందుకు ఇంకుడు గుంతల ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామ సభలను నిర్వహించి, పారదర్శకంగా ప్రణాళికలను రూపొందించి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానం చేస్తే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి,జడ్పి సీఈఓ రామ్ రెడ్డి,నర్సంపేట ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శృతి హర్షిత, ఆర్డీవో ఉమా రాణి, డిఆర్డిఓ నాగ పద్మజ, సంబంధిత శాఖల అధికారులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# బీఎల్ఓ, ఎస్ఐఆర్ విధులు రద్దు చేయాలి

- **కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల నిరసన**
- **డిమాండ్లు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన**




**కుషాయిగూడ, మహా:** అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు అప్పగించిన బీఎల్ఓ, ఎస్ఐఆర్ విధులను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. ఆలిండియా డిమాండ్స్ డే సందర్భంగా శుక్రవారం మేడ్చల్-బమల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి. సునీత మాట్లాడుతూ.. ఐసీడీఎస్ విధులతో పాటు అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. బీఎల్ఓ, ఎస్ఐఆర్ విధులను వెంటనే రద్దు చేయాలని, లేకపోతే సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి. శోభారాణి మాట్లాడుతూ.. ఉదయం నుంచి రాత్రి వరకు సర్వేలు, ఆన్‌లైన్ నమోదు, ఓటరు ఫారాల పంపిణీ వంటి పనులతో అంగన్‌వాడీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గత ఐదేళ్లుగా బీఎల్ఓ విధులకు సంబంధించిన బకాయిలను విడుదల చేయలేదని చెప్పారు. ఎస్ఐఆర్ విధులు కొనసాగిస్తే నెలకు రూ.30 వేల అదనపు పారితోషికం ఇవ్వాలని, డేటా, ప్రింటింగ్, స్టేషనరీ ఖర్చులకు ప్రత్యేక అలవెన్సులు కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కె. ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి గ్రాట్యుటీ, పెన్షన్ అమలు చేయాలని కోరారు. ఐసీడీఎస్‌ను ప్రైవేటీకరించవద్దని, ప్రీ-ప్రైమరీ విద్యను అంగన్‌వాడీలకే అప్పగించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమాదేవి, శివరాణి, స్వరూప, భాగ్యరేఖతో పాటు పలువురు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

# వైభవంగా వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీజేపీ మేడ్చల్ ఇన్‌చార్జ్ ఏనుగు సుదర్శన్ రెడ్డి**



కుషాయిగూడ, మహా: ఘట్కేసర్ డివిజన్ వేమన నగర్ కాలనీలో శ్రీదేవి-భూదేవి సమేత శ్రీ విజయ వెంకటేశ్వరస్వామివారి 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజలు, హోమాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధితో పాటు ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, భక్తిభావాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. బ్రహ్మోత్సవాల్లో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ పెద్దలు, మహిళలు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రజలు ఆరోగ్యంగా... జీవించే హక్కును కాపాడండి

- **బాలాజీ నగర్ లో మహనీయుల విగ్రహాలకు వందన సమర్పణ**
- **హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ .**



**కుషాయిగూడ, మహా :** డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఆరోగ్యంగా జీవించే హక్కును కాపాడాలని, హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జవహర్ నగర్ పరిధిలోగల శాంతినగర్ వైయస్సార్ నగర్ ప్రాంతాల్లో జరిగిన పాదయాత్రకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ జవహర్ నగర్ రాంకీ చెత్త డంపింగ్ యార్డ్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో చట్టపరమైన చర్యలు చేపట్టి పర్యావరణ శాస్త్రవేత్తలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు సూచనలు పరిగణలోకి తీసుకొని ప్రజలు ఆరోగ్యంగా జీవించే హక్కును కాపాడాలని చంద్రకుమార్ పిలుపునిచ్చారు. బాలాజీ నగర్ లో గల అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి వందనం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణలో భాగంగా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ బాధిత ప్రాంతాల ప్రజలకు కూడా వర్తిస్తాయని తెలిపారు. ఇక్కడ నివసిస్తున్న లక్షలాది ప్రజలతోపాటు సకల జీవరాసుల మనుగడ దెబ్బతీయడం రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతమన్నారు. ప్రజలు జీవించే హక్కులో భాగంగా ఆరోగ్య భద్రత పర్యావరణ పరిరక్షణ కొరకు ఉద్యమిస్తున్న సామాజిక ఉద్యమ సంస్థలకు ప్రజలు ప్రజాస్వామిక వాదులు మేధావులు అండగా నిలబడాలని కోరారు. ఈ పోరాటం ఏ ఒక్కరిదో కాదని, ప్రజలందరి సమిష్టి బాధ్యత అని తెలిపారు. రాజ్యాంగబద్ధంగా ఇక్కడి బాధ్యత ప్రాంత ప్రజల పౌర ప్రజాస్వామిక హక్కుల కొరకు నిరసనలు ఆందోళనలు తెలియజేసే హక్కులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి ,కన్వీనర్ ఉమా మహేష్, సలహాదారు మాజీ ఉపసర్పంచ్ ఆర్. నరసింహ గౌడ్, శివన్నారాయణ ,అనురాధ, గడ్డం సదానందం, జాగృతి మేక లలిత యాదవ్, బీఎస్పీ యక స్వామి, జాన్, సింగారయ్య గౌడ్, ఆంజనేయులు, పెరక సునీత, ప్రవీణ్, శివ బాబు, తోటపల్లిశంకర్, చంద్రమౌళి, మల్లేష్, కమిటీ సభ్యులు స్వరూప, లక్ష్మీబాయి, జయసుధ, సూర వెంకన్న, అల్లూరి సావిత్రి, ఫాతిమా, సురేందర్, రాజనర్సింహ, ప్రజా కళాకారుడు వెంకటాచారి, కళాకారుడు వెంకటాచారి తుమ్మరాని, అరుణ, మహమ్మద్ జావేద్, రాజు, కె.వేణు యాదగిరి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆలేరు పీఏసీఎస్ చైర్మన్‌గా ఉపేందర్ రెడ్డి

**ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న విప్ బీర్ల ఐలయ్య**

**యాదాద్రి భువనగిరి** జిల్లా ఆలేరు మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరై నూతన చైర్మన్ జనగాం ఉపేందర్ రెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాలు, ధాన్యం కొనుగోలు తదితర సహకార సేవలను పారదర్శకంగా అందించి పీఏసీఎస్‌లను మరింత బలోపేతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, సహకార సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. నూతన పాలకవర్గం రైతుల విశ్వాసాన్ని నిలబెట్టేలా నిబద్ధతతో పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి రైతుకు చేరవేయడానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సహకార శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# భద్రకాళి మాడ వీధుల బాధితులకు అండగా నిలిచిన ప్రభుత్వం

**ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామక పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్**

**హనుమకొండ మహా;** ఓరుగల్లు శ్రీ భద్రకాళి మాడ వీధుల అభివృద్ధి పనుల నేపథ్యంలో ప్రభావితమైన కుటుంబాల జీవనోపాధికి భరోసా కల్పించే చర్యల్లో భాగంగా, అర్హులైన 30 మంది బాధితులకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామక పత్రాలను శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో పంపిణీ చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, నియామక పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రభావితమైన కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. బాధిత కుటుంబాల జీవనోపాధి మెరుగుపడేలా ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, వారి సంక్షేమానికి అవసరమైన చర్యలను ప్రభుత్వం ప్రాధాన్యంతో అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, గృహ, ఉపాధి పథకాల ప్రయోజనాలు కూడా అర్హులైన కుటుంబాలకు అందేలా చర్యలు కొనసాగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కుడా సిపిఓ అజిత్ రెడ్డి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# గోల్కొండ బోనాల ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించాలి

- **దేవాదాయ ధర్మాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ**

**మహా వరంగల్ బ్యూరో** : హైదరాబాద్ గోల్కొండ కోట లోని జగదాంబికా అమ్మవారి దేవస్థానంలో మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో శుక్రవారం బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బోనాల ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్ల పై సంబంధిత అధికారులకు మంత్రి సురేఖ దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ గోల్కొండ జగదాంబికా అమ్మవారి చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, జూలై 16 నుంచి ప్రారంభమయ్యే ఆషాడ బోనాల ఉత్సవాల్లో తొలి బోనం గోల్కొండ జగదాంబికా మహంకాళి అమ్మవారికి సమర్పించడం ఆనయితీగా వస్తున్నదని అన్నారు. జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు జరిగే గోల్కొండ బోనాల ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సంపూర్ణ సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

జూలై 16న లంగర్ హౌస్ కూడలి నుంచి ప్రారంభమయ్యే అమ్మవారి బోనం సమర్పణ, తొట్టెలు రథం ఊరేగింపు, మెట్ల పూజకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి జూలై 16, 19, 23, 26, 30, ఆగష్టు 2,6,9,13 తేదీల్లో నిర్వహించే ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ట్రాఫిక్, పార్కింగ్, క్యూ లైన్లు, బారికేడ్లు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, అగ్నిమాపక, ప్రత్యేక బస్సులు తదితర ఏర్పాట్లు సమగ్రంగా ఉండాలని స్పష్టం చేశారు. దేవాలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, మొబైల్ టాయిలెట్లు, తాగునీటి కేంద్రాలు, వైద్య శిబిరాలు, 108 అంబులెన్స్ సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

భక్తులకు ఏ చిన్న అసౌకర్యం కలగకుండా గోల్కొండ కోట పరిధిలోని రహదారులు, మెట్లు, విద్యుత్ దీపాలు, హైమాస్ట్ లైట్లు, సూచిక బోర్డులు, షెడ్లు తదితర సౌకర్యాలు ముందుగానే సిద్ధం చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. అలాగే భక్తుల దర్శనం సాఫీగా సాగేందుకు దేవాదాయ శాఖ ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలని ఆదేశించారు.

బోనాల ఉత్సవాలు కొనసాగినన్ని రోజులు పోలీస్ శాఖ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

# బాల కార్మికులు లేని సమాజాన్ని నిర్మిద్దాం

- **బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్**



**బెల్లంపల్లి, మహా:** బాల కార్మికులు లేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ పిలుపునిచ్చారు.శుక్రవారం రోజు బెల్లంపల్లి పట్టణంలో 65 డిప్పు లో బాలల హక్కుల ప్రజా వేదిక మంచిర్యాల జిల్లా కమిటీ ముఖ్య సలహాదారులు కుడికాల లక్ష్మి ఐదు రోజుల క్రితం మరణించిన సందర్భంగా వారి కుటుంబాన్ని పరామర్శించిన సంతాపాన్ని తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలిద్దామని , బాలల హక్కులు పకడ్బందీగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, బాలలచే ఎవరైనా పని చేయించినట్లయితే టోలి ఫ్రీ నెంబర్ 1098 కు సమాచారం అందించాలని కోరారు. బాల్యం చాలా గొప్పదని విద్యార్థులను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. విద్య ద్వారానే సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.



## రాయల్ బ్లూ లెహంగాలో
# బంధవి శ్రీధర్ మెరుపులు..

టాలీవుడ్ యువ నటి బంధవి శ్రీధర్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షించారు. రాయల్ బ్లూ రంగు లెహంగా చోలీలో ఆమె కనిపించిన తాజా ఫొటోలు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సంప్రదాయ వస్త్రధారణకు ఆధునిక ఫ్యాషన్ టచ్‌ను జోడిస్తూ ఆమె ప్రదర్శించిన లుక్‌కు నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.ఈ ఫొటోషూట్‌లో బంధవి ధరించిన రాయల్ బ్లూ లెహంగా చోలీ క్లాసిక్ ఎలిగెన్స్‌కు నిదర్శనంగా నిలిచింది. సంప్రదాయ నైపుణ్యాన్ని ప్రతిబింబించే డిజైన్‌తో పాటు ఆధునిక ఫ్యాషన్ ట్రెండ్‌లను సమన్వయం చేసిన ఈ దుస్తులు ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేశాయి. ఆత్మవిశ్వాసంతో కూడిన చిరునవ్వు, హుందాతనాన్ని ప్రతిబింబించే హావభావాలు, సొగసైన పోజులు ఈ ఫొటోషూట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
లెహంగాకు జోడించిన బంగారు ఆభరణాలు ఆమె రూపానికి మరింత రాజసాన్ని తీసుకొచ్చాయి. నెక్లెస్, చెవిపోగులు, గాజులు, ఇతర సంప్రదాయ నగలు మొత్తం లుక్‌ను మరింత గ్రాండ్‌గా మార్చాయి. ముఖ్యంగా రాయల్ బ్లూ, గోల్డ్ కలర్ కాంబినేషన్ ఆమె వ్యక్తిత్వాన్ని మరింత హైలైట్ చేసింది.

ఈ అందమైన లెహంగాను ప్రముఖ డిజైనర్ నికితా తివారి రూపొందించగా, సంప్రదాయ హస్తకళకు ఆధునిక డిజైన్‌ను జోడించిన తీరు ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. పండుగలు, పెళ్లిళ్లు, ప్రత్యేక వేడుకల్లో ధరించేందుకు ఈ తరహా డిజైన్లు ప్రస్తుతం యువతలో మంచి ఆదరణ పొందుతున్నాయి. బంధవి ధరించిన ఈ అవుట్‌ఫిట్ కూడా ఫ్యాషన్ ప్రేమికులకు కొత్త ట్రెండ్‌గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇండోర్ లొకేషన్‌లో నిర్వహించిన ఈ ఫొటోషూట్‌ను ఫొటోగ్రాఫర్ అఖిల్ కెంగర్ల అద్భుతంగా బంధించారు. సహజమైన లైటింగ్, ఫ్రేమింగ్, కలర్ టోన్‌లతో ప్రతి ఫొటోను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. బంధవి వ్యక్తిత్వాన్ని, ఆమె స్టైలింగ్‌ను మరింత అందంగా ఆవిష్కరించేలా ప్రతి ఫ్రేమ్‌ను రూపొందించారు.

చైల్డ్ ఆర్టిస్టుగా సినీ ప్రయాణాన్ని ప్రారంభించిన బంధవి శ్రీధర్, ఇప్పుడు యువ కథానాయికగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. నటనతో పాటు ఫ్యాషన్, స్టైల్ విషయంలోనూ తనదైన ముద్ర వేస్తూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు. తెలుగు చిత్రాలతో పాటు పాన్‌ఇండియా స్థాయిలోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటూ తన కెరీర్‌ను విస్తరించుకుంటున్నారు.

సోషల్ మీడియాలో కూడా బంధవికి మంచి ఫాలోయింగ్ ఉంది. ఆమె షేర్ చేసే ప్రతి ఫొటో, ప్రతి ఫ్యాషన్ లుక్ అభిమానుల్లో చర్చనీయాంశంగా మారుతోంది. ట్రెండీ వెస్ట్రన్ అవుట్‌ఫిట్స్‌తో పాటు సంప్రదాయ దుస్తుల్లోనూ సమానంగా మెప్పించే అరుదైన నటీమణుల్లో బంధవి ఒకరని సినీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు.


ప్రస్తుతం బంధవి శ్రీధర్ పలు తెలుగు చిత్రాలతో పాటు మరికొన్ని పాన్‌ఇండియా ప్రాజెక్ట్‌లలో నటిస్తూ బిజీగా ఉన్నట్లు సమాచారం. నటిగా తన ప్రతిభను నిరూపించుకోవడమే కాకుండా, ఫ్యాషన్ ఐకాన్‌గా కూడా గుర్తింపు పొందే దిశగా ఆమె వేగంగా ముందుకు సాగుతున్నారు. సంప్రదాయం, ఆధునికత రెండింటినీ సమానంగా మేళవించే ఆమె స్టైల్ యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

# 'లెనిన్'తో అఖిల్‌కు బ్రేక్ దక్కిందా?



టాలీవుడ్‌లోకి అడుగుపెట్టి పదేళ్లు దాటినా ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయిన అక్కినేని అఖిల్, తాజాగా 'లెనిన్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ గ్రామీణ యాక్షన్ డ్రామా శుక్రవారం థియేటర్లలో విడుదలైంది. చిత్తూరు జిల్లా 'భారతం మిట్ట' గ్రామం నేపథ్యంలో సాగే ఈ కథలో అనాథగా పెరిగిన లెనిన్‌ను వసంత్ తన సొంత తమ్ముడిలా పెంచుతాడు. లెనిన్ ప్రేమించిన భారతి అనుకోని పరిస్థితుల్లో వసంత్‌ను వివాహం చేసుకోవాల్సి రావడంతో కథ కీలక మలుపు తిరుగుతుంది. ఆ తర్వాత స్నేహం, నమ్మకం, ద్రోహం, ప్రతీకారం చుట్టూ కథ ఆసక్తికరంగా సాగుతుంది.
ఈ చిత్రంలో అఖిల్ తన గత సినిమాలకు భిన్నంగా పూర్తి స్థాయి పల్లెటూరి యువకుడి పాత్రలో ఒదిగిపోయాడు. స్టైలిష్ లుక్స్, మాస్ ఎలివేషన్ల కంటే నటనకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. ముఖ్యంగా ఇంటర్వెల్, క్లైమాక్స్ సన్నివేశాల్లో అతను చూపించిన ఇంటెన్సిటీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. వింటేజ్ నాగార్జునను గుర్తు చేసే గెటప్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.
దర్శకుడు మురళి కిషోర్ మహాభారతంలోని స్నేహం, నమ్మకద్రోహం, కుట్రల అంశాలను గ్రామీణ నేపథ్యంలో మేళవించే ప్రయత్నం చేశారు. తొలి భాగంలో ప్రేమకథ నెమ్మదిగా సాగినా, ప్రీఇంటర్వెల్ నుంచి కథ వేగం అందుకుంటుంది. ఇంటర్వెల్ ట్విస్ట్ సినిమాపై ఆసక్తిని పెంచుతుంది. అయితే హీరో-హీరోయిన్ల ప్రేమకథకు మరింత బలం, విలన్ పాత్రకు స్పష్టమైన కారణం ఉంటే భావోద్వేగం ఇంకా బాగా పండేదనే భావన కలుగుతుంది.
తమన్ అందించిన నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. 'ఎట్టా ఎట్టా', 'వారెవా' పాటలు ఆకట్టుకుంటాయి. హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే తన నటనతో మెప్పించగా, ప్రమోద్, శివాజీ, ఈశ్వరీ రావు తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. నిర్మాణ విలువలు కూడా ఉన్నతంగా కనిపిస్తాయి.
మొత్తంగా చూస్తే 'లెనిన్' అఖిల్ కెరీర్‌ను ఒక్కసారిగా మార్చేసే సినిమా కాకపోయినా, ఆయన గత చిత్రాలతో పోలిస్తే మెరుగైన ప్రయత్నంగా నిలుస్తుంది. కమర్షియల్ అంశాలు, ట్విస్టులు, అఖిల్ కొత్త నటనను ఆస్వాదించాలనుకునే వారికి ఈ చిత్రం ఒకసారి చూడదగ్గ ఎంటర్‌టైనర్‌గా చెప్పొచ్చు. ఇప్పుడు ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితం సాధిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# ఆగస్టు 7న 'కొరియన్ కనకరాజు'.. వరుణ్ తేజ్‌కు సోలో రిలీజ్ కలిసొస్తుందా?




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటిస్తున్న **'కొరియన్ కనకరాజు'** సినిమా విడుదల తేదీని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ హారర్ ఫాంటసీ కామెడీ చిత్రాన్ని ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఆ రోజున పెద్ద సినిమాల పోటీ లేకపోవడంతో వరుణ్ తేజ్‌కు సోలో రిలీజ్ అడ్వాంటేజ్ దక్కినట్లుగా సినీ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో ఈ చిత్రంపై అభిమానుల్లో మరింత ఆసక్తి నెలకొంది.
తెలుగు సినిమాల్లో అరుదుగా కనిపించే క్రాస్ కల్చర్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే విడుదలైన టీజర్ మంచి అంచనాలు పెంచింది. రిలీజ్ డేట్ పోస్టర్‌లో వరుణ్ తేజ్ స్టైలిష్ లుక్ ఆకట్టుకోగా, సినిమా కథలో కొరియా నేపథ్యం ఎలా ఉండబోతోందనే ఆసక్తి కూడా పెరిగింది. ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో వరుణ్ తేజ్ కొరియన్ భాషలో చెప్పిన డైలాగ్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సినిమాపై చర్చ మరింత జోరందుకుంది.
ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి స్పందన లభించింది. ముఖ్యంగా సిద్ శ్రీరామ్ ఆలపించిన 'కంసాహామ్నిదా' పాటకు తమన్ అందించిన సంగీతం ప్రేక్షకులను ఆకట్టుకుంది. దీంతో సినిమా సంగీతంపై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. చిత్రీకరణలో కీలక భాగాన్ని వియత్నాంలో పూర్తి చేయగా, విజువల్స్‌తో పాటు కథలోనూ కొత్తదనం చూపించేందుకు చిత్రబృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలుస్తోంది.
ఈ చిత్రంలో ప్రముఖ కమెడియన్ సత్య కీలక పాత్రలో నటిస్తున్నారు. వరుణ్ తేజ్-సత్య కాంబినేషన్ సినిమాలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని, వీరిద్దరి మధ్య వచ్చే కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులను అలరిస్తాయని యూనిట్ చెబుతోంది. వరుణ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తుండగా, యువీ క్రియేషన్స్‌తో కలిసి ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.
ఇటీవల వరుసగా విభిన్న కథలను ఎంచుకుంటున్న వరుణ్ తేజ్, ఈసారి కూడా కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. సోలో రిలీజ్, ఆసక్తికరమైన కథ, హారర్‌కామెడీ అంశాలు ఈ చిత్రానికి ఎంతవరకు కలిసి వస్తాయో తెలుసుకోవాలంటే ఆగస్టు 7 వరకు వేచి చూడాల్సిందే.

# రామ్ 23లో సంయుక్తా మీనన్?

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా రూపొందుతున్న 23వ చిత్రంపై అనౌన్స్‌మెంట్ నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఓ కొత్త దర్శకుడు తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని పాన్‌ఇండియా స్థాయిలో మైండ్ బ్లోయింగ్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఎక్కడా రాజీ పడకుండా రూపొందిస్తున్న ఈ చిత్రానికి యువ సంగీత దర్శకుడు సామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు.అయితే ఈ సినిమా హీరోయిన్ ఎంపికపై ఇంకా అధికారిక స్పష్టత రాలేదు. తొలుత పలువురు హీరోయిన్ల పేర్లు వినిపించినప్పటికీ తుది నిర్ణయం తీసుకోలేదు. తాజా సమాచారం ప్రకారం రామ్ సరసన కథానాయికగా టాలీవుడ్ లక్కీ చార్మ్ సంయుక్తా మీనన్ పేరును చిత్రబృందం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చర్చలు తుది దశకు చేరాయని, కథ, పాత్ర నచ్చడంతో సంయుక్తా కూడా సానుకూలంగా స్పందించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం.ఇప్పటికే టాలీవుడ్‌లో వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న సంయుక్తా మీనన్, 'స్లమ్ డాగ్', 'స్వయంభూ'తో పాటు మహిళా ప్రధాన చిత్రం 'బ్లాక్ గోల్డ్' వంటి ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ఇప్పుడు రామ్ 23లో అవకాశం దక్కితే ఆమె ఖాతాలో మరో భారీ ప్రాజెక్ట్ చేరినట్లే. రామ్-సంయుక్తా జోడీ వెండితెరపై ఎలా అలరిస్తుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





# యూరప్ వెకేషన్‌కు ప్రభాస్.. ఆ తర్వాత వరుస షూటింగ్‌లే

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస భారీ చిత్రాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'స్పిరిట్', హను రాఘవపూడి రూపొందిస్తున్న **'ఫౌజీ'**తో పాటు 'సలార్ 2', 'కల్కి 2898 AD2' చిత్రాలు ఆయన లైనప్‌లో ఉన్నాయి.
ఈ వరుస షూటింగ్‌ల మధ్య ప్రభాస్ త్వరలోనే స్వల్ప విరామం తీసుకోనున్నట్లు సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో 'స్పిరిట్' సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్న ప్రభాస్, హీరోయిన్ త్రిప్తి డిమ్రితో కీలక సన్నివేశాలు, యాక్షన్ ఎపిసోడ్‌ల చిత్రీకరణలో బిజీగా ఉన్నారు. తాజా షెడ్యూల్ పూర్తయిన వెంటనే సుమారు పది రోజుల పాటు యూరప్‌లో వెకేషన్‌కు వెళ్లనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.
వెకేషన్ ముగించుకుని వచ్చిన తర్వాత ప్రభాస్ పూర్తిగా 'ఫౌజీ' చిత్రంపై దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియాడిక్ లవ్ స్టోరీలో ఇమాన్వి హీరోయిన్‌గా పరిచయమవుతుండగా, షూటింగ్ చివరి దశకు చేరుకుంది. మిగిలిన చిత్రీకరణ పూర్తయ్యాక 'స్పిరిట్'ను పూర్తి చేసి, అనంతరం 'కల్కి 2898 AD2', 'సలార్ 2' చిత్రాల షూటింగ్‌ల్లో పాల్గొననున్నట్లు సమాచారం. భారీ ప్రాజెక్టుల మధ్య కాస్త విశ్రాంతి కోసం ప్రభాస్ ఈ చిన్న విరామాన్ని తీసుకుంటున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com